Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 62 Issue No : 62 | ఆదివారం Sunday | జూన్ 7, 2026 7 JUNE 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# సర్వే చేస్తాం...

» తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం » క్యాడర్‌కు చంద్రబాబు క్లారిటీ

» పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ » తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక » డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి » లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస » ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం.

2 – మిగతా..





## ఆర్థిక సలహా మండలితో ప్రధాని సమావేశం

న్యూఢిల్లీ : ప్రధాని శనివారం ప్రధాని మంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులతో సమావేశయ్యారు. ప్రపంచ సంక్షోభ సమయంలో భారత ఆర్థిక వృద్ధిని మరింతగా పెంచేందుకు అనుసరించాల్సిన చర్యలు, ఆలోచనలపై మోడీ ఈ సమావేశంలో చర్చించారు. అలాగే జీవన, వ్యాపార సౌలభ్యం కోసం చేపట్టాల్సిన సంస్కరణలపై కూడా ప్రధాని ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ పడే ప్రభావాన్ని ఆర్థిక సలహా మండలి సభ్యులు ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సర జిడిపి 7.7 శాతం నమోదైందని శు క్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శనివారమే మోడీ ఆర్థిక సలహా మండలి సభ్యులతో సమావేశం కావడం గమనార్హం.

## మేము ఇప్పటికీ కడప కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది

### హోంమంత్రి వంగలపూడి అనిత

» కనిగిరిలో చిరాగ్ పాశ్వాన్ తో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనిత

» వైసీపీ హయాంలో దళితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వ్యాఖ్య

» తనపై, ఎంఎస్ రాజుపై అట్రాసిటీ కేసులు పెట్టించారని మండిపాటు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

వైసీపీ అధినేత జగన్ పై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని.



దళిత నాయకురాలైన తనతో పాటు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై కూడా అక్రమంగా అట్రాసిటీ కేసులు పెట్టించారని అనిత మండిపడ్డారు. ఆ కేసుల నిమిత్తం నేటికీ తాము కడప కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, సాధారణంగా అంబేద్కర్ విగ్రహాలు ఊరి చివరన ఉంటాయని... కానీ, కనిగిరి పట్టణ నడిబొడ్డున అన్ని వర్గాల ప్రజలు కలిసి విగ్రహం ఏర్పాటు చేయడం

2 లో..



## లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

» 9 మంది మృతి

బీరూట్ : కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడుల్ని కొనసాగి స్తూనే ఉంది. శనివారం దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఒక సీనియర్ అధికారితో సహా సైనికులతోపాటు పలువురు మరణించారని లెబనీస్ సైన్యం వెల్లడించింది. మొత్తంగా ఈ దాడుల్లో 9 మంది మృతి చెందారు.

- మిగతా 2లో..

## డ్రోన్ దాడులు జరిగినా వెనక్కి తగ్గలేదు..

» రష్యా సదస్సులో నిబద్ధత చాటుకున్న లోకేష్

» రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సదస్సుకు హాజరైన మంత్రి నారా లోకేష్

» సదస్సు ప్రారంభానికి ముందు సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై ఉక్రెయిన్ డ్రోన్ల దాడులు

» దాడులు జరిగినా ముందుగా నిర్ణయించిన పర్యటనను కొనసాగించిన లోకేష్

» ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం

» పెట్టుబడిదారులకు ఇచ్చిన మాటకే కట్టుబడినట్లు వెల్లడి



రష్యా : రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కీలకమైన అంతర్జాతీయ ఆర్థిక సదస్సు ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో ఉద్రిక్తత నెలకొంది. ఇలాంటి భయానక పరిస్థితుల్లోనూ, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా నారా లోకేష్ ఆ సదస్సుకు హాజరై తన నిబద్ధతను, ధైర్యాన్ని ప్రదర్శించారు. భారతదేశం నుంచి హాజరైన ఏకైక రాష్ట్ర ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరం ప్రారంభానికి

2 – మిగతా..



## సమాజంలో ప్రతి వర్గాన్ని నాశనం చేస్తోన్న మోడీ ప్రభుత్వం

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ : సమాజంలో ప్రతి వర్గాన్ని మోడీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం తీవ్రంగా ఆరోపించారు. ప్రస్తుత జాతీయ వ్యవహారాల స్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల దీర్ఘకాలిక దృక్పథాన్ని, సమాజంలోని వివిధ వర్గాలపై వాటి ప్రభావాన్ని ఖర్గే ప్రశ్నించారు. కాగా, 'మీరు ఎలాంటి భారతదేశాన్ని కావాలనుకుంటున్నారో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.

- మిగతా 2లో..

## "ఏఐ"తో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపు

» టచ్ చేయకుండానే మొబైల్ వీడియో ద్వారా ఆటోమేటిగ్గా శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతల నమోదు

» ఆశా యాప్ తో "శిశు మాపన్" యాప్ అనుసంధానం » మంగళగిరి నియోజకవర్గంలోని ఆశాలు, ఎ. ఎన్. ఎం.లకు శిక్షణ » ఫలితాలు అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు

» వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల (హెల్త్ స్టాండర్డ్స్) గుర్తింపునకు ఏఐ (ఆర్టిఫిషియల్ మేధస్సు-కృత్రిమ మేధస్సు) ఆధారిత సేవలు వినియోగించబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దైనందిన విధుల్లో భాగంగా ఆశాలు ఉపయోగించే 'యాప్'లోనే ఏఐ ఆధారిత నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల (బరువు, ఎత్తు, చాతీ, భుజం భాగశీ తల చుట్టుకొలతలు) వివరాలను అనుసంధానం చేస్తామని తెలిపారు.

2 – మిగతా..





## నైజర్ ఎడారి విషాదం

### దాహంతో 49 మంది మృతి!

నియామే (నైజర్): సహారా ఎడారిలో అత్యంత హృదయవిదారక సంఘటన చోటుచేసుకుంది. మాలీ దేశంలో పండుగ వేడుకలు ముగించుకుని తిరుగుపయనమైన ప్రయాణికులను మోసుకెళ్తున్న ఒక లారీ ఎడారి నడిబొడ్డున పాడైపోవడంతో.. తీవ్రమైన ఎండలు, దాహానికి తట్టుకోలేక మహిళలు, పిల్లలతో సహా 49 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర నైజర్‌లోని అస్సామాకా పట్టణానికి పశ్చిమంగా దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో, అల్జీరియా సరిహద్దుకు సమీపంలో ఈ ఘోరం జరిగింది.

- మిగతా 2లో..

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

» దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్

» జూన్ 4న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు » వేగంగా ముందుకు కదిలి నేడు ఏపీలో అడుగుపెట్టిన రుతుపవనాలు » ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం... జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి.

⏭ వివరాలు 2లో..

# సంపాదకీయం

## ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఏపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశాడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణాల వరకు కోట్లల్లో మోసాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సెంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. అదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

## సర్వే చేస్తాం..



అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు.గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

**'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది :** గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు.కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు. "యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి" అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

## "ఏఐ"తో నవజాత శిశువుల
# ఆరోగ్య ప్రమాణాల గుర్తింపు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖతో కుదిరిన అవగాహన ప్రకారం 'వాద్వానీ-ఏఐ' సంస్థ రూపొందించిన 'శిశు మాపన్ యాప్' ఆధారంగా అనుసంధానం జరుగుతుందని పేర్కొన్నారు. దీనికి ముందుగా 'ఏఐ'కి సుమారు 1,000 మంది నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల వివరాలను వీడియోల రూపశీలో డేటా బేస్ ఇవ్వబోతున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే మంగళగిరి నియోజకవర్గంలోని ఇందిరానగర్, కొప్పురావు కాలనీ, కాజా, ఎర్రబాలెం పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు 1,000 మంది నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను 'శిశ మాపన్' యాప్ ఆధారంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం సదరు ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేసే ఆశాలు, ఎ. ఎన్.ఎం. లకు శిక్షణ కార్యక్రమాలను దశల వారీగా ప్రారంభించే ప్రక్రియ మొదలైందని వెల్లడించారు. ఇక్కడ ఫలితాలు అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఏఐ ఆధారిత సేవల ద్వా రా నవజాత శిశు వుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపు మొదలవుతుందని నేడొక ప్రకటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. దీనివల్ల ఆశాలు, ఎ.ఎన్. ఎం.లపై పనిభారం తగ్గుతుందని తెలిపారు. శిశువుల ఆరోగ్య సంరక్షణకు మరింత భరోసా పెరుగుతుందని చెప్పారు. ఏఐ ఆధారిత సేవల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

**42 రోజుల్లోగా ఆరుసార్లు వివరాల నమోదు చేయాలి!**

పుట్టినప్పటి నుంచి 42 రోజుల్లో(పుట్టిన రోజు కాకుండా)గా ఆరుసార్లు (3వ రోజు, 7, 14, 21, 28 42వ రోజు) ఆశాలు



నవజాత శిశువుల ఇళ్ల(హోమ్ బేస్డ్ న్యూ బార్న్ కేర్)కు వెళ్లి, తల చుట్టు, ఛాతీ, చేతి చుట్టు, బరువు, ఎత్తుల వివరాలను గుర్తించి సదరు వివరాలను యాప్ లో నమోదుచేయాలి. శిశు వు ల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపు కోసం వెయింగ్ మిషన్, ఇన్ ఫాంటో (అఅట్ఘుత్శీ) మీటర్, టేపులను ఆశాలు ఉపయోగిస్తున్నారు. వీటి బరువును మోస్తూ నవజాత శిశువులు ఉన్న ఇళ్లకు వెళ్లడంలో ఆశాలు అవస్థలుపడుతున్నారు. ఒక్కో ఇంటి వద్ద కనీసం 10 నిమిషాల నుంచి 15 నిమిషాల వరకు సమయ పడుతోంది. అంతేకాకుండా కొలతలు గుర్తింపు, వివరాల నమోదుకు శిశువులు సహకరించకపోతుండడం, అసౌకర్యానికి గురవుతుండడశీ జరుగుతోంది.

**'టచ్' చేయకుండానే..।**

ఈ పరిస్థితుల్లో వాద్వానీ సంస్థ వారు శిశువును తాకకుండానే, బరువు, ఎత్తు, ఛాతీ, భుజం కింద, తల చుట్టుకొలత గుర్తించేందుకు 'శిశు మాపన్' యాప్ను తయారుచేసింది. దీనివల్ల శిశువు దగ్గర యాప్ డౌన్లోడు చేసిన చరవాణిని ఉంచినట్లయితే అత్యంత తక్కువ వ్యవధిలో నిర్దేశిత ప్రమాణా లు అందులో ఆటోమేటిగ్గా నమోదవుతాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా శిశువుల శరీరతత్త్వం ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సుమారు వెయ్యి మంది శిశువుల ఆరోగ్య ప్రమాణాల డేటా బేస్ (వీడియోలు)ను ఏఐకి వైద్య ఆరోగ్య శాఖ అందించబోతుంది. ఈ డేటా బేస్ తయారైతే సదరు వివరాలను ఆశాల యాప్ లో ఇంటిగ్రేట్ చేస్తారు. ఇదంతా జరిగేందుకు కనీసం మూడు నెలల వరకు సమయం పడుతుంది. మంళగిరి నియోజకవర్గ పరిధిలోని ఆశాలు, ఎ. ఎన్. ఎం.లకు దశల వారీగా శిక్షణ ఇచ్చి, ఫీల్డ్ లో వీడియోల తీసే ప్రక్రియ శుక్రవారం నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. "శిశు మాపన్" యాప్ ద్వారా తక్కువ సమయంలోనే నవజాత శిశువుల ఎదుగుదలలో లోపాలు ఉన్నట్లయితే తెలిసిపోతుంది. దీనికి అనుగుణంగా సదర ప్రాంతాల మెడికల్ ఆఫీసర్లకు 'అలర్ట్' వెళ్తుంది. శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ఫలితాలు బాగుంటాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ వెల్లడించారు చరవాణుల ద్వారా తీసే వీడియోల ద్వారా గుర్తించే వివరాల నమోదులో ఖచ్చితత్త్వం గుర్తింపులో ఎటువశీటి సమస్యలు లేవని పేర్కొన్నారు.

## నైజర్ ఎడారి విషాదం

ఈ ప్రమాదం నుండి ఇద్దరు ప్రయాణికులు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. లారీ ఆగిపోయిన తర్వాత వారు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, సహాయం కోసం ఎడారి ఇసుక తిన్నెలపై దాదాపు 50 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించారు. ఎట్టకేలకు అస్సామాకా పట్టణానికి చేరుకుని స్థానిక అధికారులకు సమాచారం అందించడంతో ఈ దారుణ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

**అక్కడే సామూహిక ఖననం..**

సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, అప్పటికే లారీలో ఉన్న 49 మంది మరణించారు. ఎడారిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా



ఉండటం, మృతదేహాలు ఇప్పటికే కుళ్ళిపోయే స్థితికి చేరుకోవడంతో.. అధికారుల సమక్షంలోనే వారిని ఎడారిలోనే సామూహికంగా ఖననం చేశారు.



## లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

శనివారం ఉదయం నబతియే నగరాన్ని మర్జయూన్ పట్టణంతో కలిపే రహదారిపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన వైమానిక దాడిలో ఒక బ్రిగేడియర్ జనరల్, ఒక కెప్టెన్, మరో సైనికుడు మరణించినట్లు లెబనీస్ సైన్యం తెలిపింది. వారు ప్రయాణిస్తున్న వాహనం పూర్తిగా ధ్వంసమయింది. అయితే ఈ ఘటనలో మృతుల పేర్లను మాత్రం వెంటనే వెల్లడించలేదు. కాగా, ఇజ్రాయిల్ సైన్యం చేసిన మరో వైమానిక దాడిలో దక్షిణ సక్సకియా గ్రామంలో ఆరుగురు మరణించగా, నలుగురు గాయపడ్డారని ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.కాగా, ఈ దాడులపై లెబనాన్ సైన్యం స్పందించింది. ఇజ్రాయిల్ సైన్యం ఉద్దేశపూర్వకంగా లెబనాన్ ప్రజలు, సైన్యంపై సాగిస్తున్న దురాక్రమణ దాడులు మా సంకల్పాన్ని, విశ్వాసాన్ని పట్టుదలను మరింత పెంచుతుంది అని లెబనాన్ సైన్యం తన ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ దాడులపై ఇజ్రాయిల్ సైన్యం వెంటనే స్పందించలేదు.



## మేము ఇప్పటికీ కడప
## కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది

అభినందనీయమన్నారు. ఆరుగురు ప్రధానుల వద్ద పనిచేసిన ఘనత దివంగత నేత రామ్ విలాస్ పాశ్వాన్ ది అని కితాబునిచ్చారు. ఇక కూటమిపై వస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తూ... నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో అందరికీ 'రెడ్‌బుక్' మాత్రమే కనిపిస్తోందని, కానీ ఆయన రాజ్యాంగాన్ని చేతబూని యాత్ర చేసిన విషయం ఎందుకు కనిపించడం లేదని హోంమంత్రి అనిత ప్రశ్నించారు.

## ఏపీలోకి ప్రవేశించిన
## నైరుతి రుతుపవనాలు..

రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## సమాజంలో ప్రతి వర్గాన్ని నాశనం
# చేస్తోన్న మోడీ ప్రభుత్వం

మీరు సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి సూత్రాలను విస్మరించడం స్పష్టంగా కనిపిస్తుంది. పన్ను చెల్లింపుదారుల డబ్బుతో వివిధ పథకాలను ప్రారంభించి, ఆ పథకాల ప్రచారంతో ప్రజలను కొద్దిగా మోసం చేయవచ్చు. కానీ మీరు మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసులు, వంచితులు, విద్యార్థుల హక్కులను దెబ్బతీసి, వారిని ఆగ్రహానికి గురిచేశారు' అని ఖర్గే గతంలో రాజ్యసభలో మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వీడియోను తాజాగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్టు చేసింది.

## డ్రోన్ దాడులు జరిగినా వెనక్కి తగ్గలేదు..



ముందు జరిగిన ఈ డ్రోన్ దాడులతో నగరం చుట్టూ హై-సెక్యూరిటీ అలర్ట్ ప్రకటించారు. ఆ సమయంలో లోకేష్, పలువురు పెట్టుబడిదారులతో సమావేశాల కోసం మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యంలోనే ఆయనకు దాడుల గురించి సమాచారం అందింది.

దీంతో భద్రతాపరమైన సమీక్షలు జరిగాయి. అయినప్పటికీ లోకేష్ వెనక్కి తగ్గలేదు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సదస్సుకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరుగుతున్న తరుణంలో, ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, వాటిని నిలబెట్టుకునే విశ్వసనీయత చాలా ముఖ్యం. ఇది కేవలం ప్రదర్శన కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే దృఢ సంకల్పంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భద్రతా హెచ్చరికల నడుమ సదస్సుకు చేరుకున్న లోకేష్, తన పర్యటనను యథావిధిగా కొనసాగించారు. పలువురు ఇన్వెస్టర్లు, వ్యాపార దిగ్గజాలతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. డ్రోన్ దాడుల వార్తలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసినా, ఏపీ ప్రగతికి అంతరాయం కలగకూడదనే సంకల్పంతో లోకేష్ ముందుకు సాగారు.

## కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్

- మాజీ మంత్రి కన్నబాబు
- కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, రైతుల మోసపోయారన్న కన్నబాబు
- హామీలు నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్
- గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని మండిపాటు



**ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ :** కూటమి ప్రభుత్వ వైఫల్యాల వల్ల నిరుద్యోగులు, రైతులు తీవ్రంగా మోసపోయారని వైసీపీ నేత, మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. కాకినాడలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే అమరావతి రైతుల నుంచి డీఎస్సీ అభ్యర్థుల వరకు ప్రతి ఒక్కరూ ప్రస్తుతం జగన్ ను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు.ప్రస్తుత రాజకీయాలపై స్పందిస్తూ... కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్ మాత్రమేనని కొనియాడారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవాల్టికీ ఎందుకు ఇవ్వలేదని నిలదీసిన ఆయన... ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ఈ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నడిచిన 'అమ్మఒడి'ని కాపీ కొట్టి 'తల్లికి వందనం'గా మార్చారని, అయినా దీని అమలులో కూటమి ప్రభుత్వం కనీసం పాస్ మార్కులు కూడా తెచ్చుకోలేకపోయిందన్నారు. ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఇస్తామన్న మాటను తుంగలో తొక్కి, ఏకంగా 20 లక్షల మంది విద్యార్థులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. ఈ పథకానికి రూ.13,112 కోట్ల బడ్జెట్ అవసరమైతే, కేవలం రూ.8,456 కోట్లే కేటాయించడాన్ని తప్పుబట్టారు.

మరోవైపు, ఆక్వా రైతుల సమస్యలపై కూడా కన్నబాబు గళమెత్తారు. నిన్న జరిగిన ఎక్స్‌పోలో సీఎం చంద్రబాబు 'బ్లూ ఎకానమీ' అంటూ గొప్పలు చెప్పుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఆక్వా రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. జగన్ హయాంలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీలు ఇచ్చి, రొయ్యల మేత ధరలు పెరగకుండా నియంత్రణలో ఉంచామని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సీజన్ వచ్చేసరికి రొయ్యల ధరలను దారుణంగా పడిపోయేలా చేసి రైతులను నష్టాల్లోకి నెట్టేశారని కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైజేఆర్ డిఎమ్ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ కు పూర్వ వైభవం

**మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి సారథ్యంలో ఆధునిక హంగులతో ల్యాబ్‌ల నవీకరణ**
**ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ, 100% ప్లేస్‌మెంట్స్ లక్ష్యంగా యాజమాన్యం అడుగులు**
**మచిలీపట్నం పోర్టు, అమరావతి నిర్మాణాల నేపథ్యంలో స్థానిక విద్యార్థులకు స్వర్ణావకాశాలు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి< వర్తమాన కాలంలో సాంకేతిక విద్యలో సివిల్ ఇంజనీరింగ్ తదితర కోర్ బ్రాంచెస్‌కు పూర్వ వైభవం తేవడానికి మచిలీపట్నంలోని ప్రముఖ విద్యాసంస్థ యలమంచిలి జనార్ధన రావు, డిఎమ్ఎస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ (YJR DMS)నడుం కట్టింది. దేశ విదేశాల్లో ఖ్యాతిగాంచిన ఎందరో ప్రముఖ సివిల్ ఇంజనీర్లు, రామ్కీ ఇండస్ట్రీస్ చైర్మన్ బి. గీతమ్ రెడ్డి వంటి పారిశ్రామికవేత్తలు ఈ ప్రతిష్ఠాత్మక కాలేజీ విద్యార్థులే కావడం విశేషం.సుజనా చౌదరి సారథ్యంలో నూతన శకం 2025 నుండి ఈ కాలేజీని మాజీ కేంద్ర మంత్రివర్యులు, విజయవాడ వెస్ట్ నియోజకవర్గ ప్రస్తుత శాసనసభ్యులైన సుజనా చౌదరి వారి తండ్రి పేరు మీద యలమంచిలి జనార్ధనరావు, డిఎమ్ఎస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ పేరుతో సరికొత్తగా అభివృద్ధి చేయుచున్నారు. కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల కోర్ బ్రాంచెస్‌కు ఈ మధ్య కాలంలో కొద్దిగా ఆదరణ తగ్గినప్పటికీ, ప్రస్తుత కాలేజీ యాజమాన్యం సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు మరలా పూర్వ వైభవం తేవడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తోంది.




అత్యాధునిక ల్యాబ్‌లు – అంతర్జాతీయ ప్రమాణాలుఈ కళాశాలలోని సివిల్ బ్రాంచిలో డిప్లొమా (పాలిటెక్నిక్), బి.టెక్, ఎమ్.టెక్ విద్యార్థులకు ఆధునిక బోధనా పద్ధతుల్లో అత్యుత్తమ ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం విశేష అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించడంతో పాటు, విద్యార్థుల ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం కింది ల్యాబ్‌లను అత్యాధునిక హంగులతో నవీకరించారుఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెషినరీ లాబ్‌స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ లాబ్‌కాంక్రీట్ లాబ్ఇక ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా ఇక్కడ మెటీరియల్ టెస్టింగ్, సాయిల్ టెస్టింగ్ తదితర పరీక్షలు, స్ట్రక్చరల్ డిజైన్స్ వంటి లైవ్ వర్క్స్ ప్రామాణికంగా నిర్వహిస్తున్నారు.ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ – క్యాంపస్ ప్లేస్‌మెంట్స్విద్యార్థులు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు అవటమే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సాధించేలా కళాశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.ఉచిత ఆటోక్యాడ్ బయట కోచింగ్ సెంటర్లకు వేలాది రూపాయలు చెల్లించాల్సిన అవసరం లేకుండా, కళాశాల లోపలే ఉచితంగా సాఫ్ట్‌వేర్ శిక్షణ ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.దీనితో పాటు ఆధునిక టెక్నాలజీపై వర్క్ షాప్స్, సెమినార్స్, గెస్ట్ లెక్చర్స్ నిర్వహించడం ద్వారా విద్యార్థులను పరిపూర్ణ జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. కళాశాల ప్రెసిడెంట్ పీవీరావు ఆధ్వర్యంలో, యాజమాన్య ప్రతినిధి వీరమాచనేని కిరణ్ విద్యార్థులకు 100% ప్లేస్‌మెంట్ ఇప్పించే దిశగా పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. స్థానిక విద్యార్థులకు పెరగనున్న ఉద్యోగ అవకాశాలుప్రస్తుతం మచిలీపట్నం పోర్టు అభివృద్ధి వేగంగా జరుగుతుండటం, అలాగే అమరావతి రాజధాని పరిసర ప్రాంతాలలో నిర్మాణ పనులు ఊపు అందుకోవడంతో సివిల్ ఇంజనీర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పరిధిలోని ఆర్ అండ్ బి (R&B), ఆర్‌డబ్ల్యూఎస్ (RWS), ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (AEE) ఉద్యోగాల రిక్రూట్మెంట్ జరగనుంది. వీటన్నింటినీ అందుకోవడానికి వైజేఆర్ డిఎమ్ఎస్ కళాశాల విద్యార్థులకు అత్యధిక అవకాశాలు, వసతులు స్థానికంగానే అందుబాటులో ఉన్నాయి.



టి సురేష్ బాబు,
ఎం.టెక్, పీహెచ్ డి, ప్రొఫెసర్ అండ్ హెడ్ డిపార్టమెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, 35 సంవత్సరాలు ఎక్స్పీరియన్స్
వైజెఆర్ డిఎం ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మచిలీపట్నం



## స్వచ్ఛమైన డివిజన్... సుందరమైన భవిష్యత్తు

**45వ డివిజన్‌లో ఆపరేషన్ క్లీన్ స్వీప్**

**రోడ్డు ఊడ్చి, డ్రైనేజీ పూడికతీత పనుల్లో పాల్గొన్న ఇండియన్ గ్యాస్ అధినేత వాలిశెట్టి తిరుమలరావు**

**45వ డివిజన్ ఇంచార్జ్ పి.వి. ఫణి కుమార్ కృషి అభినందనీయం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మన డివిజన్ అందంగా ఉంటే... ప్రజలు ఆనందంగా ఉంటారు. ఆరోగ్యం కావాలంటే ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాల్సిందే అని ఇండియన్ గ్యాస్ అధినేత వాలిశెట్టి తిరుమలరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా శనివారం సిడింబి అగ్రహారంలోని నారాయణ స్కూల్ ఎదురుగా ఉన్న రోడ్డులో పారిశుధ్య పనులను నిర్వహించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛంద పనుల్లో వాలిశెట్టి తిరుమలరావు స్వయంగా పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ పూడికను తీసి, పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డును ఊడ్చారు.పరిశుభ్రత ఎవరిదో కాదు... మన బాధ్యతఈ సందర్భంగా వాలిశెట్టి తిరుమలరావు మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ఎవరిదో బాధ్యత కాదు, మన బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ద్వా రా ప్రజల్లో పచ్చదనం, పరిశుభ్రతపై చైతన్యం తేవడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉంటేనే డివిజన్ అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఇంటి ముందూ శుభ్రత ఉంటే మొత్తం డివిజనే పరిశుభ్రంగా మారుతుందని సూచించారు.

ఫణి కుమార్ కృషి అభినందనీయం...45వ డివిజన్ ఇంచార్జ్ పి.వి. ఫణి కుమార్ సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతిరోజూ ఈ ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహించడం అభినందనీయమని తిరుమలరావు కొనియాడారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు సహా కూటమి పెద్దలందరినీ కలుపుకుంటూ డివిజన్ అభివృద్ధి, సంక్షేమానికి ఫణి కుమార్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు.ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో డివిజన్ స్వచ్ఛ సైనికులతో పాటు గంజాల రవికుమార్, డాక్టర్ బొల్లా ప్రసాద్, కొనకళ్ళ భాను ప్రసాద్, కాళీపట్నం రఘు, జీవీఎల్ నరసింహారావు, కిరణ్, సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ మాచవరపు మానస, ఇతర డివిజన్ సచివాలయ, శానిటేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## మచిలీపట్నం రైల్వేపై నీలి నీడలుస్లీపర్ క్లాస్ బోగీల తగ్గింపుపై లంకిశెట్టి బాలాజీ ఆగ్రహం




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పేరుతో కోట్లు ఖర్చు చేస్తున్న అధికారులు, ప్రయాణికుల కనీస వసతులను గాలికొదిలేస్తున్నారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నంలో జరిగిన విలేకరుల సమావేశంలో రైల్వే శాఖ ఏకపక్ష వైఖరిపై ఆయన మండిపడ్డారు.సామాన్యుడిపై భారం ఆదాయం కోసం మచిలీపట్నం - బీదర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గతంలో ఉన్న 14 స్లీపర్ బోగీలను 7కు తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.ఏసీ కోచ్‌ల కోసమేనా?: కేవలం లాభాల కోసమే ఏసీ కోచ్‌లను పెంచి, సామాన్యులకు అందుబాటులో ఉండే స్లీపర్ బోగీలను తగ్గించడం వల్ల రోజుకు 500 మంది ప్రయాణికులు రిజర్వేషన్లు దొరక్క అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాట్‌ఫారాలు పెరిగాయి.. బోగీలు తగ్గాయి కోట్లతో పొడవైన ప్లాట్‌ఫారాలు నిర్మించి, రైలు పొడవును (బోగీలను) తగ్గించడం అధికారుల తుగ్లక్ చర్య అని విమర్శించారు.ప్రధాన డిమాండ్లుబోగీల పునరుద్ధరణ: హైదరాబాద్ - బీదర్ ట్రైన్‌కు తొలగించిన 7 స్లీపర్ బోగీలను తక్షణమే పునరుద్ధరించాలి.తిరుపతి రైలు: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న మచిలీపట్నం - తిరుపతి రైలును వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి.ఎంపీ బాలశౌరి చొరవ చూపాలికేంద్ర రైల్వే శాఖతో మాట్లాడి మచిలీపట్నం ప్రాంత ప్రజలకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని పరిష్కరించాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిని లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. రైల్వే మంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం.. మన చేతుల్లోనే మన ఆరోగ్యం

**యోగాంధ్రను విజయవంతం చేయండి**
**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు**



**ప్రాణం ఉన్నంతవరకు ప్రాణాయామం చేద్దాం.. అవయవాలు ఉన్నంతవరకు ఆసనాలు వేద్దాం**
**డీకే బాలాజీ, జిల్లా కలెక్టర్**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యంగా ఉంటే అంతకు మించిన సంపద లేదు అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరగబోయే యోగా సంబరాల షెడ్యూల్‌ను కలెక్టర్ వివరించారు.జిల్లాలో యోగాంధ్ర వేడుకల ముఖ్య షెడ్యూల్తేదీ & సమయం వేదిక (కార్యక్రమ స్థలం) ప్రత్యేకతజూన్ 7 (ఆదివారం) ఉదయం 7:00 గంటలకు మంగినపూడి బీచ్ యోగాంధ్ర కార్యక్రమాల ఘన ప్రారంభం (ఏర్పాట్లు ముమ్మరం)జూన్ 10 (బుధవారం) ఉదయం 7:00 గంటలకు గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం లారీ, ఆటో సంఘాల ప్రతినిధులతో కలిసి బృహత్ యోగాజూన్ 16 (మంగళవారం) ఉదయం 7:00 గంటలకు కూచిపూ డి (మొవ్వ మండలం) శ్రీ సిద్దేంద్ర కళాక్షేత్రం ప్రముఖ నాట్య క్షేత్రంలో యోగాసనాల ప్రదర్శనజూన్ 21 (ఆదివారం) ఉదయం 7:00 గంటలకు ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి పాఠశాల అంతర్జాతీయ యోగా దినోత్సవం (జిల్లా స్థాయి ముగింపు వేడుకలు)ప్రతి మండలంలోనూ ఉచిత యోగా శిక్షణ యోగాను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త చర్యలు చేపట్టింది.జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఒక్కో మాస్టర్ ట్రైనర్ (శిక్షకుడు) అందుబాటులో ఉంటారు. యోగాపై ఆసక్తి ఉన్న 50 మంది ప్రజలను ఎంపిక చేసి, వారికి ప్రత్యేకంగా యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తారు.కలెక్టర్ విజ్ఞప్తి..యోగ అనేది కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం. జిల్లాలో నిర్వహించే ఈ యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున, విరివిగా పాల్గొని విజయవంతం చేయాలి అని ఒక ప్రకటనలో తెలియజేశారు.



## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన పేర్ని కృష్ణమూర్తి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై నుంచి జారిపడి గాయపడి, ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వైఎస్ఆర్సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి పరామర్శించారు.



పెదపట్నం గ్రామానికి చెందిన పాము స్వామినాథం, పోలాటితిప్ప గ్రామానికి చెందిన కొక్కి లిగడ్డ రమేష్‌లు ఈ ప్రమాదంలో క్షతగాత్రులై ఆసుపత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న పేర్ని కృష్ణమూర్తి ఆసుపత్రికి చేరుకుని బాధితులను ఓదార్చారు. వారికి అందు తున్న వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్ర మంలో పేర్ని కృష్ణమూర్తితో పాటు వైఎస్ఆర్సీపీ నార్త్ మండల అధ్యక్షుడు మట్ట నాంచార్య, నియోజకవర్గ యువత అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ కేడీసీ బ్యాంక్ డైరెక్టర్ బాలయేసు, మండల నార్త్ రైతు అధ్యక్షుడు గడిదేసి రాజు మరియు పార్టీ ముఖ్య నాయకులు, వైఎస్ఆర్సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

**వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా వై.జె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ (DLSA) అవగాహన సదస్సు**




**ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా**

**కృష్ణాజిల్లా ఎస్పీ రూపకల్పన చేసిన చైతన్యం పోస్టర్ల ఆవిష్కరణ మరియు సైబర్ క్రైమ్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన**

మచిలీపట్నం/ క్రైమ్ రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న బాలల హక్కుల ఉల్లంఘన, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా పిలుపునిచ్చారు. మంగినపూడి బీచ్ రోడ్డులోని వై.జె.ఆర్. (YJR) ఇంజనీరింగ్ కళాశాలలో, జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ (DLSA) ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల గుర్తింపు - చైతన్యం అనే అంశంతో పాటు, వరల్డ్ ఫుడ్ డే ప్రాముఖ్యత, సైబర్ క్రైమ్ చట్టాల పై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే కృష్ణాజిల్లా ఎస్పీ ప్రత్యేకంగా రూపకల్పన చేసిన చైతన్యం అవగాహన పోస్టర్లను ఈ వేదికపై ఘనంగా ఆవిష్కరించారు.లైంగిక వేధింపులపై కఠిన చట్టాలు: జడ్జి మహమ్మద్ రహమతుల్లాఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా మాట్లాడుతూ, పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల పట్ల సమాజంలో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.పిల్లలపై జరిగే వేధింపులను ప్రాథమిక దశలోనే గుర్తించడం ముఖ్యం. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై చట్టం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. బాధితులకు చట్టపరంగా లభించే రక్షణ, న్యాయ సహాయం గురించి విద్యార్థులందరూ అవగాహన కలిగి ఉండాలి. చట్టాల పట్ల అవగాహనతోనే ఇటువంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించగలం అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగానే ఎస్పీ మార్గదర్శకత్వంలో రూపొందిన చైతన్యం పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంచేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని జడ్జి పేర్కొన్నారు.మహిళల భద్రత - సైబర్ క్రైమ్ జాగ్రత్తలు బందరు తాలూకా ఎస్ఐకార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న బందరు తాలూకా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సైబర్ నేరాలు, అసాంఘిక పరిస్థితులపై క్షుణ్ణంగా వివరించారు. సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సైబర్ క్రైమ్ చట్టాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పారు.సమాజంలో గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఏదైనా అన్యాయం, వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. సాంకేతికతను వాడుకుంటూనే, ఆపద సమయాల్లో దాని ద్వారా ఎలా రక్షణ పొందాలో ఆత్మరక్షణ మార్గాలను వివరించారు.ఘనంగా వరల్డ్ ఫుడ్ డే..ఇదే వేదికపై ప్రపంచ ఆహార దినోత్సవం (వరల్డ్ ఫుడ్ డే) ప్రాముఖ్యతను కూడా గుర్తుచేశారు. ఆహార వృధాను అరికట్టడం, పౌష్టికాహార విలువలను తెలుసుకోవడం యువత బాధ్యతని వక్తలు పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నాగ జ్యోతి మాట్లాడుతూ...శుభ్రతతో కూడిన ఆహారాన్ని స్వీకరించటం ద్వారా విద్యార్థులలో శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శారీరక దారుఢ్యానికి తోడ్పడుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నాగజ్యోతి అన్నారు. విద్యార్థులలో మానసిక ఆరోగ్యంతో పాటు, యోగా సాధన పట్ల అవగాహన పెంచుకోవటంతో ఏకాగ్రతతో పాటు చదువు పట్ల శ్రద్ధ వహించగలుగుతారు. ఈ చైతన్య శిబిరంలో న్యాయ సేవాధికారి సంస్థ అడ్వకేట్ ముసలయ్య, ఎం మణికంఠ, కాంతి శ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధిగా అబ్దుల్ నబి, తదితర శాఖాధిపతులు మరియు వై.జె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, మరియు విద్యార్థి-విద్యార్థినులు



పాల్గొన్నారు. చట్టాలపై, సైబర్ భద్రతపై, ఆత్మరక్షణపై నిపుణులు ఇచ్చిన సలహాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాభూమి

ఏలూరు,పశ్చిమగోదావరి 4

ఆదివారం 07 , జూన్ 2026

## శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధి లో హైకోర్టు జడ్జి

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు తేదీ 6. 6. 2026 శనివారం అనగా ఈరోజు హానబుల్ జస్టిస్ శ్రీ. అభిషేక్ రెడ్డి, పాట్నా హైకోర్టు వారు దంపతులతో శ్రీ స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరిని ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు గారు శేష వస్త్రంతో సత్కరించినారు. ఆలయ ప్రధాన అర్చకులు కిష్టప్ప గారు, అనిల్ గారు వారికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెంట్ పి వాసు, పాలకొల్లు అడిషనల్ సివిల్ జడ్జ్ ( జూనియర్ డివిజన్) వి ఎస్ ఎన్ లక్ష్మీ లావణ్య గారు, పాలకొల్లు టౌన్ తహసిల్దార్ వై దుర్గా కిషోర్ గారు, టౌన్ సిఐ రజిని కుమార్ గారు, కోర్ట్ సూపరింటెంట్ సువర్ణ రాజు గారు, ఆలయ అకౌంటెంట్ గాంధీ గారు మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి అర్జీని సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ.

ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.



ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం నిడమర్రు తహశీల్దారు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిడమర్రు గ్రామానికి సంబంధించిన మూడవవిడత "ఒక నెల- ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సంయుక్తంగా పాల్గొని, ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. దివ్యాంగుని దగ్గరకు జిల్లా జాయింటు కలెక్టరు, ఎమ్మెల్యే స్వయంగా వెళ్ళి అర్జీని స్వీకరించి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. ముందుగా గత రెండువారాల్లో వచ్చిన అర్జీలుపై శాఖలు వారీగా సమీక్షించి, పరిష్కారంలో వెనుకబడిన శాఖలు అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ ప్రజలు తమ గ్రామంలోనే నేరుగా అధికారులను కలుసుకుని తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదో చక్కని వేదిక అని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు నుంచి అందిన అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలని అన్నారు. గ్రామస్థాయిలో సమస్యలను అధిక ప్రాధాన్యత నిచ్చి త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని జిల్లా జాయింటు కలెక్టరు అధికారులను ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలు విషయంలో అర్జీదారులకు కారణాలను స్పష్టంగా తెలియ జేయ్యాలని అన్నారు. మూడు విడతలుగా నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలుపై తీసుకున్న చర్యలు నివేదికలతో తదుపరి సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ వివిధ శాఖల్లో వచ్చిన ధరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులకు సంతృప్తి స్థాయిని పెంచేలా తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన మూడు గ్రామసభలలో వచ్చిన ఫిర్యాదులు నూరుశాతం పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. ప్రజాసమస్యలను పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు మరింత చేరువ కావాలనే ప్రభుత్వ లక్ష్యసాధనకు అధికారులు బాసటగా నిలిచి సమస్యలు పరిష్కారానికి కృషిచెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మిప్రసన్న, తహశీల్దారు గద్దె శ్రీధరుబాబు, యంపిడివో జి.విజయ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెళుకువలు పాటించాలి.

ప్రజాభూమి ప్రతినిధి పెదవేగి.



పెదవేగి మండలం కొత్తూరు గ్రామంలో శనివారం రైతులు చేత ప్రకృతి వ్యవసాయ విధానంలో సామూహికంగా విత్తన గుళికలు (సీడ్ పెలెటైజేషన్) తయారీ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు బి.వెంకటేష్ ఆదేశాలు మేరకు డివిజనల్ ఇన్‌చార్జి ఎన్ఎఫ్ఏ నవీన మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నవధాన్యాలు సాగులో విత్తనాలు పాడవకుండా ఉండేందుకు విత్తన గుళికలు తయారు చేసి పొలాల్లో వెదజల్లాలని తెలిపారు. ఈ విత్తన గుళికలు సుమారు ఆరునెలలు వరకు సురక్షితంగా నిల్వఉండటమే కాకుండా, అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు మెరుగైన మొలకలను అందిస్తాయని వివరించారు. రైతులు 30 రకాలు వరకు నవధాన్యాలు విత్తనాలను పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి భూసారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగు పడుతుందని రైతులకు అవగాహన కల్పించారు.

## డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకి పర్యావరణ మిత్ర నేషనల్ అవార్డు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు కు చెందిన డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకి పర్యావరణ మిత్ర నేషనల్ అవార్డు-2026 లభించింది. పర్యావరణ దినోత్సవం సందర్భంగాహైదరాబాదులో డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకి పర్యావరణ మిత్ర నేషనల్ అవార్డు-2026 ను శ్రీ వర్సిటీ లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ అవార్డుల కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హర్యానా మరియు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా విచ్చేసి పర్యావరణ పరిరక్షణ అత్యంత అవశ్యమని, ప్రకృతిని కాపాడుకునే ఆసన్నమైందని , ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు ట్రస్ట్ ఫౌండర్ & చైర్మన్ డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకి పర్యావరణ మిత్ర నేషనల్ అవార్డు-2026 ను బండారు దత్తాత్రేయ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీనటి పూజిత జొన్నలగడ్డ, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆశ్రిత రోయ్యూరు, బిజెపి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి, పుడమి సాహితీ వేదిక అధ్యక్షులు డాక్టర్ చిలుముల బాల్రెడ్డి, తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ కూన గోపాలకృష్ణ తుదితులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట



కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం కామవరపుకోట హైస్కూల్ చైర్మన్ డాన్ దివాకర్ బాబు బొబ్బిలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దోలా విజయ్ - ఏఎంసి డైరెక్టర్ గోరేక సతీష్ కామవరపుకోట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రాజేష్ - కామవరపుకోట పట్టణ ప్రధాన కార్యదర్శి విచ్చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బారావు, సిహెచ్ ప్రశాంత్ కుమార్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ గస్పాబు మాస్టర్,ముళ్ల గిరి కిషోర్, నల్లమోతుల సత్యన్నారాయణ,జోడలా మోహన్ రమేష్ మాస్టర్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో, స్థానిక శాసనసభ్యులు రోషన్ కుమార్ ఎంపి పుట్టా మహేష్ కుమార్ ఆశీస్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు..

## నేడే మానవత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేడు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. తాళ్లపూడి సొలస దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రాజమండ్రికి చెందిన సంజీవిని బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సహాయం అందించవచ్చని, ఇది అత్యున్నత మానవ సేవ అని అన్నారు. ఈ సందర్భంగా మానవత చైర్మన్ సింహాద్రి జనార్ధన్ మాట్లాడుతూ యువత, స్వచ్ఛంద సేవకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ సేవలో భాగంగా మానవత సంస్థ నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్ తో పాటుగా ఫోటో ఫ్రేమ్ ను జ్ఞాపకను పాతూరి ఆదిత్య ఇస్తారని తెలిపారు. రక్తదాన శిబిరం ఉదయం నుంచి ప్రారంభమవుతుందని ఆసక్తి గల దాతల నుంచి రక్త సేకరణ చేపట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాసబోయిన చంద్రయ్య, అప్పన హనుమంతరావు, సనపల రాజశేఖర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## భూసర్వేలో లోపాలపై రైతుల అభిప్రాయాల సేకరణ

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో ఐదో విడత భూసర్వే ప్రక్రియలో భాగంగా ఏలూరు జిల్లా ఉప సర్వే, భూసమాచార అధికారి మహమ్మద్ అన్సారి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు డి.వి.ఎస్. జగన్మోహన్‌రావు, దన్నపనేని రాంబాబు భూములకు సంబంధించిన సర్వే నంబర్లు 161, 155 ప్రాంతాలను పరిశీలించి, వారి సమక్షంలో భూమి పరిస్థితులను పరిశీలించారు. మండల సర్వేయర్ ఎస్. రామకృష్ణబాబు, గ్రామ సర్వేయర్లు మస్తాన్ శ్రీకాంత్, విజయ కనకదుర్గ, గ్రామస్థులు పాల్గొన్న ఈ తనిఖీల సందర్భంగా భూసర్వే ప్రక్రియపై వివరంగా అవగాహన కల్పించి, సర్వేలో ఉన్న లోపాలు, సమస్యలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. తనిఖీల అనంతరం అధికారులు చేపట్టిన చర్యలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేసి, అధికారులను అభినందించారు.

## జూన్ 8 నుండి వ్యవసాయ వ్యాప్ ద్వారానే ఎరువులు పంపిణీ

ప్రతి ఒక్కరు ఈ పంట నమోదు చేయించుకోవాలి

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట



మండల వ్యవసాయ అధికారి వారి కార్యాలయం నందు మండలంలో గల సొసైటీ సంఘాలు, ప్రైవేట్ ఎరువుల డీలర్లు మరియు రైతు సేవ కేంద్రం సిబ్బందికి యూరియా మరియు డిఏపి పంపిణీ పై అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి డి ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ జూన్ 8 నుండి నుండి ఆఫైమ్స్ యాప్ ద్వారా రైతులకు యూరియా మరియు డిఏపి పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సాగు చేస్తున్న ప్రతి రైతు కూడా ఈ పంట నమోదు చేసుకోవాలని ఈ పంట నమోదు చేసిన రైతులకు మరియు వారి విస్తీర్ణానికి తగినట్టుగా యూరియా ఎరువు రైతుకి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పంట నమోదు చేసిన జాబితాను ఆయా రైతు సేవ కేంద్రాల వద్ద ప్రదర్శించడం జరిగిందని, రైతులు వాటిని పరిశీలించి పొరపాట్లు ఏమన్నా ఉంటే కనుక సరి చేసుకోవాల్సిందిగా తెలియజేసి ఉన్నారు. రైతులు ఏమాత్రం ఆందోళన చెందవలసిన అవసరం లేదని, సాగు చేసే విస్తీర్ణానికి తప్పనిసరిగా యూరియా డి ఏ పి ఎరువులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా అసలైన సాగుదారు విస్తీర్ణానికి యూరియా ఎరువులు అందించడం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా ఈ కార్యక్రమం పై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. కావున రైతులు ఆయా గ్రామాలలో ఎరువుల డీలర్ను సంప్రదించినప్పుడు తప్పనిసరిగా ఆధార్ గుర్తింపు కార్డు తీసుకొని వెళ్లి యూరియా ఎరువులు తీసుకోవలసినదిగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సేవ కేంద్ర సిబ్బంది మరియు ప్రైవేటు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు



ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే చంటి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న ఆయన, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్ ముగింపు.. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ఘనంగా ముగిసింది. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు పుస్తక పఠనం, కథా వాచనం, సృజనాత్మక కార్యక్రమాల్లో శిక్షణ పొందారు. ముగింపు సందర్భంగా విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈడే వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఈడే రమాదేవి బహుమతుల పంపిణీకి సహకరించారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన దాతలు, తల్లిదండ్రులు, పాఠకులకు గ్రంథాలయ అధికారి ఈ.జి.ఎస్.వి. కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో నేర్చుకున్న అంశాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదవాడి ఇంటి నిర్మాణ పనులు చురుకుగా

సొంతింటి కలను నెరవేరుస్తున్న మంత్రి నిమ్మల.

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



పాలకొల్లు బ్రాడీపేట లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన భార్యాభర్తలు ఉప్పే పెద్దింట్లు, గంగులు లకు చెందిన ఇంటి నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. వీరి సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ఇంటి నిర్మాణం పూర్తయ్యే దిశగా సాగుతున్నాయి. శనివారం జరిగిన ఇంటి స్లాబ్ నిర్మాణ పనులను మంత్రి రామానాయుడు స్వయంగా పరిశీలించారు. పనిచేస్తున్న కార్మికులతోనూ మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో పెద్దింట్లు ఇంటికి వచ్చిన మంత్రి నిమ్మల పాడైన తాటాకు ఇంట్లో ఉంటున్న పరిస్థితిని చూసి చలించి కూటమీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి నిర్మాణం చేయించే బాధ్యత నాదంటూ మాట ఇచ్చారు. నేడు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా ఇటీవల శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టించారు. ఈ పనుల్లో ఆయన శ్రమదానం కూడా చేశారు. ఇచ్చిన పిలుపుని అందుకొని పార్టీ శ్రేణులు నిర్మాణ పనుల్లో శ్రమదానం చేశారు. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తయి గృహప్రవేశం చేసుకునేలా ముస్తాబు కానుంది. ఈ కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, గంధం సుబ్బారావు, పొట్నూరి రమేష్, తాళ్లపూడి సుబ్రహ్మణ్యం, పొట్నూరి శ్రీను, బిరుదుకోట శేఖర్, నడింపల్లి ఆంజనేయులు, ధనాని శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనంపై శ్రద్ధ కనపరచాలి

ప్రిన్సిపాల్ వేదుల జనార్ధన్

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి



విజ్ఞాన సముపా ర్జనకు.... నేటి విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం అలవర్చుకోవాలని, ఆ దిశలో విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు... మార్గదర్శనం చేయాలని వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల ఉపాధ్యాయులు వేదుల జనార్ధన రావు పిలుపునిచ్చారు. విద్యార్థులు,యువతకి... పోటీ పరీక్షలకు కావలసిన మన శాఖ గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణత ఫలితాలు పొందాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా శాఖా గ్రంథాలయం నందు... వాసవి విజ్ఞాన శిబిరా తరగతులు నిర్వహించడం జరిగింది. ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయానికి విచ్చేసి, పిల్లలకు సంబంధించిన కథల పుస్తకాలు చదవడం, అదేవిధంగా... వీటివైనా పిల్లల చేత మాట్లాడించడం, చదరంగం పోటీలు నిర్వహించడం, చిత్రలేఖనం... వివిధ అంశాలపై ఆసక్తి చూపినారని, ఈ సందర్భంగా వ్యాసవిజ్ఞాన శిబిరాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జీలుగుమిల్లి శాఖ గ్రంథాలయ అధికారి సోయం రామలక్ష్మి నిర్వహణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా నేడు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి సోయం రామలక్ష్మి, కామాయపాలెం గ్రంథాలయ వాలంటీర్ మంచినీళ్ళ శ్రీనివాస్, మనకు ఆదిలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు తక్కువ ధరల్లో ఎరువుల పంపిణీకి డీసీఎంఎస్ కట్టుబడి ఉంది

చాగంటి మురళీకృష్ణ

చైర్మన్ గా ఏడాది కాలం పూర్తి చేసుకున్న చాగంటి

ప్రజాభూమి ఏలూరు



స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మాట్లాడారు. పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తైన సందర్భంగా సంస్థ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను తక్కువ ధరలకు అందించేందుకు డీసీఎంఎస్ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. సుమారు రూ.13 కోట్ల వ్యయంతో ఎరువులను నేరుగా తయారీ సంస్థల నుంచి కొనుగోలు చేసి, మధ్యవర్తులు లేకుండా రైతులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. దీంతో ఎంఆర్‌పీ కంటే తక్కువ ధరలకు ఎరువులు అందుబాటులోకి వచ్చి రైతులకు ఆర్థిక భారం తగ్గుతోందన్నారు. అలాగే, సంస్థలో పనిచేస్తున్న 15 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమం, సహకార రంగ బలోపేతం కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఆదర్శ కమ్యూనిస్టు చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాభూమి ఏలూరు



సిపిఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతిని పురస్కరించుకుని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఆర్.ఆర్.పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, సి.ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్వాతంత్ర్య ఉద్యమం, రైతు-కార్మిక ఉద్యమాలు, భూసంస్కరణల కోసం జీవితాంతం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. పేద ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సి.ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట నమోదు ఆధారంగానే యూరియా విక్రయాలు

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఖరీఫ్-2026 సీజన్ నుంచి రైతులకు పంట నమోదు వివరాల ఆధారంగానే యూరియా విక్రయాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జె. భవాని తెలిపారు. ఈ విధానంపై శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, ఎరువుల విక్రేతలకు అవగాహన కల్పించారు. భూమి రికార్డులు, పంట నమోదు వివరాలను అనుసంధానం చేసి పంట అవసరానికి తగిన మేరకే ఆధార్ ధృవీకరణతో యూరియా విక్రయించనున్నట్లు వివరించారు. పంట నమోదు వివరాల్లో లోపాలుంటే రైతు సేవా కేంద్రాల ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు విడతల వారీగా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. యూరియాను మోతాదుకు మించి వినియోగించకుండా అవసరమైనంత మాత్రమే వాడాలని రైతులకు సూచిస్తూ, ఎరువుల విక్రయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు ఆదేశించారు.

## లింగమనేని రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు

## తెలియజేసిన ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు



వెలగపూడి ఆంధ్ర ప్రదేశ్ సచివాలయం నందు ఈరోజు జనసేన పార్టీ తరపున రాజ్యసభ సభ్యునిగా నామినేషన్ దాఖలు చేసిన లింగమనేని రమేష్ ని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన ఎమ్మెల్సీలు కొణిదల నాగబాబు ని,పిడుగు హరిప్రసాద్ ని, మహాన్యూస్ ఎండీ మారెళ్ళ వంశీ కృష్ణ ని, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ని రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ "రాజ్యసభ సభ్యునిగా లింగమనేని రమేష్ కి లభించిన ఈ గౌరవం ప్రజాసేవ పట్ల వారి అంకితభావానికి నిదర్శనం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరియు రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం మీరు మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. రమేష్ పదవీకాలం విజయవంతంగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు..

## దోషులకు కఠిన శిక్ష విధించాలి

ఎస్పీకి మీడియా ప్రతినిధుల వినతి

ప్రజాభూమి ఏలూరు.




పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రుషిరావు ఇంటిపై జరిగిన దాడి ఘటనలో బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని కోరుతూ ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్‌కు మీడియా ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ది ఏలూరు ప్రెస్ ఫోరమ్ అధ్యక్షులు డి.వి. రమణ, పీఆర్వో సంజయ్, గౌరవ అధ్యక్షులు రత్నగర్భ ప్రసాద్, కోశాధికారి హరీష్, ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు జబీర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పి. నారాయణతో పాటు పలువురు సభ్యులు ఎస్పీని కలిసి ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎస్పీ ప్రతాప్ కిషోర్ మాట్లాడుతూ, ఈ ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంటనే విచారణ ప్రారంభించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే, జర్నలిస్టుల భద్రతకు జిల్లా పోలీసు శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా మీడియా ప్రతినిధులు అందరూ సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలపై పనిచేయడం అభినందనీయమని ఎస్పీ అన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సంచలన నాయకుడు వంగవీటి మోహన రంగా

**చొప్పెళ్లలో వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**



ఒకే ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సంచలన నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. చొప్పెళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తెదేపా అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. విజయవాడలో అన్ని కులాల వారు వంగవీటి మోహన్ రంగాను దేవుడిగా చూస్తారని, బడుగు బలహీన వర్గాలకు ఆయన ధైర్యాన్ని ఇచ్చారన్నారు. వంగవీటి మోహన రంగాతో ఎమ్మెల్యే బండారు తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బెజవాడ బెబ్బులిగా చిన్న చిన్న వర్గాల వారందరికీ అండగా రంగా ఉన్నారని కొనియాడారు. ఆయన జయంతి, వర్ధంతి నిర్వహించుకోవడమే కాకుండా, ఆయన విగ్రహాలు నెలకొల్పు కోవడం మాత్రమే కాకుండా, ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. చొప్పెళ్లలో కాపు కళ్యాణ మండపం మధ్యలోనే ఆగిపోయిందని, త్వరలోనే పూర్తి చేసుకుందామన్నారు. కాపు యువత ఐక్యంగా ఉండడంతో పాటు, అందరిని కలుపుకుని ముందుకు వెళ్లాలన్నారు.అందరికీ అండగా నిలబడాలని సూచించారు.

# 7 మంది అధికారులకు ఎం.పీ.డి.ఓలుగా స్థాన నియామక ఉత్తర్వులు.

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ.**

**ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు పదోన్నతి పొందిన 7 మంది అధికారులకు ఈరోజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పి. జగదాంబ స్థాన నియామక ఉత్తర్వులను అందజేశారు.జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు పరిపాలనాధికారులు( ఏ ఎస్ ఓ) నలుగురు ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (డిప్యూటీ ఎంపీడీవో) మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన అధికారులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అభినందిస్తూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మండల స్థాయిలో ఎం.పీ.డి.ఓలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, పారదర్శక పరిపాలన, సంక్షేమ పథకాల అమలులో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.జిల్లా పరిషత్ సీఈఓ పి. జగదాంబ మాట్లాడుతూ, పదోన్నతి అనేది బాధ్యతల పెరుగుదలతో కూడుకున్నదని, అధికారులందరూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పదోన్నతి పొంది స్థాన నియామకాలు పొందిన అధికారులు జి. శ్రీనివాసరావు, పరిపాలనాధికారి, జీలుగుమిల్లి మండల ప్రజా పరిషత్ -- తణుకు మండల ఎంపీడీవో.ఆర్.ఎ.ఎల్. సుజాత, పరిపాలనాధికారి, తాడేపల్లిగూడెం మండల ప్రజా పరిషత్ -- పెనుమంట్ర మండలానికి ఎంపీడీవో.జి.వి.వి.ఎస్.ఎన్. విజయకుమార్, పరిపాలనాధికారి, పి.ఆర్.ఐ. డివిజన్, జంగారెడ్డిగూడెం -- నల్లజెర్ల మండలానికి ఎంపీడీవో.ఎం. అమీర్ షరీఫ్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పెదవేగి -- టి. నర్సాపురం మండలానికి ఎంపీడీవో.వై.వి.ఆర్.వి. ప్రసాద్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పెంటపాడు -- కామవరపుకోట మండలానికి ఎంపీడీవో. కె. ఆంజనేయ శర్మ, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉండ్రాజవరం -- నిడదవోలు మండలానికి ఎంపీడీవో. పి.వి. సత్యనారాయణ, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గణపవరం -- గణపవరం మండలానికి ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన అధికారులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మరియు సీఈఓలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది,అధికారులు పాల్గొన్నారు.

# దెందులూరు బాల సదన్ లో జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్.

**ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**



ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, దెందులూరు లో ఉన్న బాల సదన్‌కు చెందిన 23 మంది బాలికలకు పోలీసు విధులతో పాటు, వ్యక్తిగత భద్రత, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.పోలీసుల పనితీరుపై అవగాహన బాల సదన్ బాలికలతో జిల్లా ఎస్పీ ముఖాముఖి ఏలూరు జిల్లా ఎస్పీ దెందులూరు బాల సదన్‌కు చెందిన 23 మంది అనాథ బాలికలను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ , ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద గల క్రాస్ రోడ్ ప్రాంతానికి ఆహ్వానించారు.పోలీసులు సమాజం లో ఎలాంటి బాధ్యతలు నిర్వర్తిస్తారో ఎస్పీ బాలికలకు వివరించారు.ట్రాఫిక్ నిబంధనల గురించి, మహిళా పోలీసుల పనితీరు గురించి వారికి అవగాహన కల్పించారు.బాలికల వ్యక్తిగత భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ అంటే ఏమిటో పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఒకవేళ ఎవరైనా వారి పట్ల అసభ్యంగా లేదా బ్యాడ్ టచ్‌తో ప్రవర్తిస్తే, భయపడకుండా వెంటనే పోలీసులకు లేదా డయల్ 112 కి గాని పెద్దలకు ఎలా ఫిర్యాదు చేయాలో సూచించారు.ఆధునిక పోలీసింగ్ పద్ధతులపై బాలికలకు అవగాహన కల్పించే క్రమంలో, ఎస్పీ డ్రోన్ కెమెరాల పనితీరును, నేరాల నియంత్రణలో , నిఘాలో వాటి ప్రాముఖ్యతను వారికి స్వయంగా చూపించారు.బాలికలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, ఉన్నతమైన జీవితాన్ని గడపాలంటే చదువు ఒక్కటే మార్గమని, విద్యార్థి దశ నుండే చదువు పట్ల అంకితభావంతో, ఆసక్తితో ఉండాలని పిల్లలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ రావు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు బాల సదనం సూపరింటెండెంట్ ఎస్. సరోజిని యు. రాణి తులసి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రెండో రోజూ కొనసాగిన ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన

**ప్రజాభూమి ప్రతినిధి, నూజివీడు**



ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన రెండోరోజు శనివారం కూడా కొనసాగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు ధృవపత్రాల పరిశీలనా ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి ధృవీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుపుతున్న తీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. రెండోరోజు కూడాక్యాప్ విద్యార్థుల సర్టిఫికెట్లను ఫ్లైట్ లెఫ్టినెంట్ శ్రీబాలాజీ, కొండలరావులు పరిశీలించారు. ఎన్.సి.సి విద్యార్థుల సర్టిఫికెట్లను 8 ఆంధ్రా నావల్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ వైపీపీ ప్రదీప్, 17 ఆంధ్రా బెటాలియన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, 8 నావల్ సూపరింటెండెంట్ దీపక్ పరిశీలించారు. ఎన్.సి.సి 487 మందికి 342 మంది, క్యాప్ 97 మందికి 69 మంది, స్పోర్ట్స్ 164 మందికి 129 మంది మొత్తంగా 748 మంది అభ్యర్థులకు 540 మంది సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మరియు ఆర్జీయూకేటీ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు పర్యవేక్షించారు. ఈ ప్రక్రియలో డీన్ అకడమిక్ డా. చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, డీఎస్డబ్ల్యు డా. రాజేష్, సతీష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ఇంకా వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆర్యావటంలో బిజెపి పదాధికారుల సమావేశం.

**ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు.**



భారతీయ జనతా పార్టీ కాజులూరు మండలం మండల పదాధికారుల సమావేశం మండలానికి చెందిన ఆర్యవటం గ్రామంలో సమావేశం నిర్వహించారు ఈ మేరకు శనివారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు పైడికొండల రామకృష్ణ, కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు లు హాజరయ్యారు . కాజులూరు మండల అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు . ఈసందర్భంగా ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో జగన్నాథగిరి ఎంపిటిసి సభ్యురాలు కొప్పన లక్ష్మి ,ఉపాధ్యక్షులు గీసాల భీమేష్, పోలిశెట్టి శ్రీనివాస్, పెద్దిరెడ్డి వీరభద్రం, ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్ వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సార్వ సాగు పనులు

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



తాళ్లపూడి మండలంలో సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వర్షాలు కురవడంతో ఎండిన చేలల్లో కొద్దిగా నీరు చేరింది. దీంతో ముందస్తు చర్యలుగా దుక్కులు దున్నే పని ప్రారంభించారు. ప్రతీ ఏటా దాళ్వా సాగు ముందుగా ముగియడంతో పనులు ప్రారంబించేందుకు రైతులకు వెసులుబాటు కలిగేది. అయితే గత దాళ్వా సాగు అలస్యంగా ప్రారంభం కావడం, ముందుగానాట్లు వేసిన చేలల్లో పంట చేతికి వచ్చింది. ఆలస్యంగా ఊడ్చిన చేలు ఇటీవలే కోతలు కోయడం వాతావరణ మార్పులతో వర్షాలు పడటంతో పంట చేతికి రావడం ఆలస్యమైంది. దీంతో సార్వా సాగు ఆలస్యంగా ప్రారంభిందామనుకున్న రైతులకు వరుణుడు కరుణించడంతో సాగు పనులు ప్రారంబించారు. మండలంలో గత సార్వాలో 11 వేల ఎకరాల్లో సార్వా సాగు చేశారు.ఇదే అంచనాతో ఈసార్వా సాగుకూడా కొనసాగిస్తారని అధికారులు అంచనాకు వచ్చినట్టు అందుకు అనుగుణంగా విత్తనాలు సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారిని రుచిత తెలిపారు. రాబోయే రోజుల్లో వాతావరణ మార్పుల ప్రభావం లేకుండా 150 రోజుల్లో పంట చేతికి వచ్చే పి.ఎల్.ఏ 1100 ఎంటియు 1318, 7029, సంపత్ స్వర్ణ విత్తనాలను సిద్ధం చేశామని ఆమె తెలిపారు.

# గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం.

**-- ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ.**

**ప్రజాభూమి, బుట్టాయగూడెం.**



జిల్లాలో గిరిజన విద్యను నిర్వీర్యం చేసి, గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ విమర్శించారు. స్థానిక ఆదివాసి విజ్ఞాన కేంద్రం భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూజిల్లాలో 25 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉండగా, వాటిలో 21 పాఠశాలల్లో 3వ, 4వ తరగతులను తొలగించడం, మరో 4 పాఠశాలల్లో కేవలం 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు మాత్రమే నిర్వహించడం గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.గిరిజన ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, ఆశ్రమ పాఠశాలలను కుదించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. 3వ, 4వ తరగతి చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడగా, 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులు చదువు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితి గిరిజన విద్యార్థుల్లో డ్రాప్‌అవుట్ల సంఖ్యను పెంచే ప్రమాదం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యాభివృద్ధిపై గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు ఆశ్రమ పాఠశాలల్లో తరగతులను తగ్గించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. గిరిజన విద్యార్థుల విద్యా హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.అందువల్ల జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు పూర్తి స్థాయిలో తరగతులను వెంటనే పునరుద్ధరించాలని, అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు మాస్టర్ ట్రైనర్స్ విజయవంతం చెయ్యాలి.

**జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ.**

**ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**



ఏలూరు యంపిడివో కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్స్ రెండు శిక్షణ కార్యక్రమంలో తొలిరోజు కార్యక్రమానికి జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రకార్యక్రమాలు విజయవంతం అగుటకు యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్స్ రెండు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, నోడల్ అధికారి, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంపై ఇప్పటికే జిల్లా అధికారులకు సమీక్షసమావేశాలు నిర్వహించి, దిశానిర్దేశం చేశారని తెలిపారు. జిల్లా స్థాయి యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాలు అయిన తర్వాత, మండల, గ్రామ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వ్రకృత్వ, తదితర పోటీలను నిర్వహిస్తామని అన్నారు. ఈనెల 07వ తేదీ నుండి 20 వతేదీ వరకు, 21 వ తేదీన జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు సంబంధించి యోగాంధ్ర ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలుపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు, ఆధ్యాత్మిక ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు, వాకథాన్, తదితర కార్యక్రమాలు శ్రీకారం చుట్టామని అన్నారు. ఈనెల 11 వ తేదీన ద్వారకా తిరుమలలోని హరిత హోటల్ లోను, 19వ తేదీన పోలవరం మండలం పట్టిసీమలో ప్రజలతో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో సమాజంలో అన్ని వర్గాలు ప్రజలు భాగస్వాములు అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్స్, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9,10 తేదీల్లో విశాఖలో వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణ.

**ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**

వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ – 2026 జూలై 9,10 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉద్యాన అధికారి, కె.సాజా నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ -- 2026 (దక్షిణ రాష్ట్రాల ఎడిషన్) ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ రాష్ట్రాల ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ వారి వివిధ ఉత్పత్తుల ప్రదర్శన, స్టాల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపనీ ఏర్పాటుకు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాల పైన, అవగాహనా సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఏలూరు జిల్లాలలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రివర్యులు, ప్రముఖ కంపెని యజమానులు పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న ఔత్సాహిక పరిశ్రమల యజమానులు ఉపయోగించుకోవాలని, తమ స్టాళ్ళ ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు పెంచుకుని తమ వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. దీనికి సంబంధించి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కువెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ -- 2026 కార్యక్రమ వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి, మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫుడ్ ప్రాసెసింగ్ కె.సాజా నాయక్ 7995086771 ఫోన్ నంబర్ ను సంప్రదించవచ్చని వివరించారు.

# తల్లి--కూతురిని హత్య చేసిన ముగ్గురు నిందితుల అరెస్ట్.

## కేసును ఛేదించిన ఏలూరు జిల్లా పోలీసులు.

**ప్రజా భూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**




చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన తల్లి--కూతురు హత్య కేసును ఏలూరు జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించి, నిందితులు పోనమాల శిరీష ( ఏ 1), కర్రి ప్రసాదు ఇలియాస్ బన్ను (ఏ 2), ఆశు దుర్గ ( ఏ 3) లను అరెస్ట్ చేశారు.ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, వ్యక్తిగత కక్షలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో నిందితులు పథకం ప్రకారం మృతులను నమ్మబలికి జీడిమామిడి తోటకు తీసుకెళ్లి, మద్యంలో మత్తు గుళికలు కలిపి తాగించారు. అనంతరం వారిపై దాడి చేసి హత్య చేసి, వారి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు.సంఘటన అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందాలు సీసీ ఫుటేజ్, సి డి ఆర్ విశ్లేషణతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను వినియోగించి నిందితుల కదలికలను గుర్తించి, నల్లజర్ల--తాడేపల్లిగూడెం ఎన్ హెచ్ – 24 రహదారిపై వారిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏ ఎస్ పి జంగారెడ్డిగూడెం సుస్మితా, ట్రైన ఐపీఎస్ శర్మ సూచనల మేరకు, ఏలూరు డి.ఎస్.పి డి. శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సీఐ రజనీ కుమార్, భీమడోలు సీఐ కృష్ణ, చేబ్రోలు ఎస్సై ఎం. సూర్య భగవాన్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టి కేసును విజయవంతంగా చేదించారు.

# ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశం

**ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.111కోట్ల చెక్కును అందజేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్.**

**రావులపాలెంలో రూ.1.52 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**



ప్రతీ కుటుంబంలోనూ ఆర్థిక అభివృద్ధి జరగాలనేదే కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎమ్ఎస్ఎమ్ఈ, సెర్ప్, గ్రామీణ అభివృద్ధి పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రావులపాలెంలో శనివారం జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిసి పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి శ్రీనివాస్ వీజీబిరామ్ జీ నిధులు రూ.1కోటితో జూనియర్ కళాశాల నుంచి శ్మశాన వాటిక వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీజీబిరామ్ జీ నిధులు రూ.40 లక్షలతో 6వ వార్డులో వాటర్ ట్యాంకు వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ నిధులు రూ.12లక్షలతో కాపు కళ్యాణ మండపం నుంచి గోలి సత్యవతి ఇంటి వరకు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రారంభించారు.అనంతరం రావులపాలెంలో జరిగిన సభలో ఎమ్ఎస్ఎమ్ఈ ద్వారా 82 మందికి రూ.4.86 కోట్లు, పీఎంఏజేవై 30 మందికి రూ.33 లక్షలు, ట్రైకేర్ ముగ్గురికి రూ.3 లక్షలు, 588 గ్రూపులకు బ్యాంకు లింకేజ్ రూ.106 కోట్లు, మొత్తం రూ.111.19 కోట్ల విలువైన చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సీనియర్ బండారు సత్యానందరావు ఎమ్ఎస్ఎమ్ఈలను ప్రోత్సహించడంలో వినూత్నంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో రావులపాలెంలో ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, ఇద్దరు ఉద్యోగులను నియమించి కొత్త కొత్త ఆలోచనలతో ఎవరు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చినా, వారికి తగిన సహకారం అందించేలా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



2047 విజన్ లో భాగంగా భారతదేశ జిడిపి అభివృద్ధి చెందాలి అంటే గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతి కుటుంబంలోనూ ఆర్థిక అభివృద్ధి జరగాలనేది ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ల ఆలోచన అన్నారు. భారతదేశంలోని ప్రజలకు అవసరమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడంతో పాటు, ఎగుమతులను సైతం ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఒక్క ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే చేస్తుందన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన రాష్ట్రంలో మాత్రమే ఈ విధమైన దృక్పథం కనబడుతుందన్నారు. మన యువతకు అవకాశాలు రావాలనేది యువ నాయకులు నారా లోకేష్ ఉద్దేశం అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా స్వయం ఉపాధి పథకాలను విస్తృతంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈలో రూ.1కోటి పెట్టుబడితో ఏదైనా పరిశ్రమ స్థాపిస్తే పదిమంది వరకు ఉపాధి కల్పించవచ్చన్నారు. ఇదే భారీ పరిశ్రమలు అయితే రూ 1కోటి పెట్టుబడికి ఒక్క ఉద్యోగం మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సైతం సహకరిస్తున్నాయన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ ఇన్సెంటివ్ ల కింద గత సంవత్సరం రూ.500 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా మరొక రూ.500 కోట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల ముందు యువత ఎంతోమంది డిఎస్సీ కోసం ఎదురుచూపులు చూసారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై కూడా ప్రతిపక్షానికి చెందినవారు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. శుక్రవారం సంబంధిత శాఖ అధికారులు ఈ అంశంపై స్పందిస్తూ పూర్తి వివరణతో, ఆధారాలతో ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీ నియామకాలపై ఇష్టం వచ్చినట్లుగా ఆరోపణలు చేయటం తగదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై సందేహాలు ఉత్పన్నం చేయడానికి మాత్రమే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ విధమైన అభివృద్ధి చేయలేకపోయారని, ఒక్క డీఎస్సీ కూడా వెయ్యలేకపోయారని, బటన్ నొక్కితే చాలనే ఆలోచనతో ప్రభుత్వాన్ని నడిపారని విమర్శించారు. ఈ రెండు సంవత్సరాల్లో గ్రామాల్లో జరిగినంత అభివృద్ధి వైసీపీ ఐదేళ్ల హయాంలో జరిగిందా? అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. రావులపాలెంలో తాను రెండు రహదారులను ప్రారంభించానన్నారు. అక్కడి స్థానిక ప్రజలు ఎమ్మెల్యే సత్యానందరావును ప్రశంసిస్తూ ఉన్నారన్నారు. ఈ విధంగా రహదారులు సైతం నిర్మించని స్థితి గత ప్రభుత్వంలో ఉందన్నారు. సాగునీటి రంగంలో కనీసం మరమ్మత్తులు సైతం వైసీపీ ప్రభుత్వ హయాంలో జరగలేదన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి రాంబాబు పిడి డిఆర్డిఏ, అదియ్య డిపిఎం సిబిఓ ఫైనాన్స్, వర్మ ఎల్ డి ఎం కోనసీమ జిల్లా, ఆకుల రామకృష్ణ, పల్లి మంగాదేవి భీమరావు, కె వి సత్యనారాయణ రెడ్డి, జక్కంపూడి బాలాజీ, పాలూరి సత్యానందం, కొప్పిశెట్టి ప్రసాద్ , కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలి

**వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా -- విశ్రాంత ఎంఈఓ ఏడిద సత్తిరాజు.**

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**



విద్యార్థినీ, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఏడిద సత్తిరాజు పిలుపునిచ్చారు. కొత్తపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏడిద సత్తిరాజు, చోడపనీడి భాస్కరరావు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థుల్లో మేధోసంపత్తి, సృజనాత్మకత పెంపొందించేందుకు ఎంతో దోహదపడినట్లు పేర్కొన్నారు. బాల్యం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని సూచించారు. అనంతరం దాత చోడపనీడి భాస్కరరావు అందించిన స్టీల్ వాటర్ బాటిళ్లు, ఏడిద సత్తిరాజు బహుకరించిన లాంగ్ నోట్ పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్లను దుస్సాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మిద్దే ఆదినారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, ప్రభాకర్, రాంబాబు, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ వి.వి.వి.ఎస్. సుబ్బారావు, కొల్లి విజయకుమారి, సకిలే శేషారావు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపూడి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 2026 వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఎంఈవో, హెచ్ఎం మరియు చదువుల సంఘం ఉపాధ్యక్షులు సి.హెచ్. ఆంజనేయులు గౌరవ అధ్యక్షులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో బీడీసీ మలకపల్లి నిర్వాహకులు కే. పాపారావు, రీడర్ ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థుల పరిచయ వేదికను నిర్వహించి, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎ. నరేష్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించి, విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ అధికారి ఏ. నరేష్ వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో మొత్తం 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 07 జూన్ 2026


## 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో అందరూ భాగస్వాములు కావాలి

### -అసిస్టెంట్ కమిషనర్ క్రాంతి కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ హై స్కూల్‌లో శనివారం "ఆపరేషన్ క్లీన్ స్వీప్ -- ఒక రాష్ట్రం, ఒక పరిశుభ్రత లక్ష్యం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మే 23 నుంచి జూన్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, విద్యాసంస్థలు, వీధులు, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించి, చెత్తను తడి-పొడి వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, పొరుగువారిలో కూడా పరిశుభ్రతపై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ, పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. అనంతరం పరిశుభ్రత ప్రతిజ్ఞను చేయించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సవరణ వేగవంతం చేయాలి

### -ప్రతి బీఎల్ఓ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలి
### -ఓటరు జాబితాలో అర్హులందరికీ స్థానం కల్పించాలి
### -మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) సూచించారు. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయం లో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఏసీపీ చంద్రమ్మతో కలిసి బీఎల్ఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 సంవత్సరంలో హిందూపురంలో నివసించిన వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో గుర్తించి, వారి వివరాలను సంబంధిత నియోజకవర్గాల ఓటరు జాబితాలతో మ్యాపింగ్ చేసి పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల సేకరణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర ధృవీకరణ చేపట్టాలని సూచించారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో ఓటరు జాబితా సవరణల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రతి బీఎల్ఓ ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాన ఓటరుతో పాటు కుటుంబ సభ్యులు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత, వివాహాల ద్వారా వచ్చిన మహిళలు, ఇతర కారణాలతో నమోదుకాని అర్హులందరిని జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పట్టణంలో విధులు నిర్వహిస్తున్న 118 మంది బీఎల్ఓలు తమ పరిధిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పనిచేయాలని సూచించారు. ప్రతిరోజూ సందర్శించాల్సిన ఇళ్ల సంఖ్య, స్వీకరించాల్సిన దరఖాస్తులు, పూర్తి చేయాల్సిన సవరణల లక్ష్యాలను నిర్దేశించుకుంటే నిర్ణీత గడువులో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయవచ్చని చెప్పారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో లేని సందర్భాల్లో కేవలం వెళ్లి తిరిగి రావడం కాకుండా, స్థానిక పెద్దలు, వార్డు ప్రముఖులు, సంఘాల ప్రతినిధులతో రచ్చబండ తరహాలో సమావేశాలు నిర్వహించి అవసరమైన వివరాలు సేకరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపడితే ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో బీఎల్ఓల పనితీరును పరిశీలించిన కమిషనర్, మంజునాథ్, అరుణ, భారతి అనే ముగ్గురు బీఎల్ఓలు తమ పరిధిలో అత్యుత్తమంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించారని అభినందించారు. వారి పనితీరును ఇతర బీఎల్ఓలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది వంటిదని, అందులో ఖచ్చితత్వం తీసుకురావడం ప్రతి బీఎల్ఓ బాధ్యత అని మల్లికార్జున పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అన్ని సవరణలను పూర్తి చేసి హిందూపురాన్ని రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ విద్యార్థులకు పునాది

### -శిక్షణ కార్యక్రమ పరిశీలనలో ఏఎంఓ, ఏఎస్ఓ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులకు ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి శిక్షణ పునాది లాంటిదని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బసవన్నపల్లిలో



నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్షా ఏఎంఓ చంద్రశేఖర్, ఏఎస్ఓ చంద్రశేఖర్ శనివారం సందర్శించి పరిశీలించారు. శిక్షణ నిర్వహణ తీరును, ఉపాధ్యాయులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించిన అధికారులు కార్యక్రమ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో భోజన వసతి, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, బోధనాభ్యాస సామగ్రి (టి.ఎల్.ఎం) వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని వంట సిబ్బందికి సూచించారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎఫ్ఎల్ఎన్ విద్యార్థుల విద్యా ప్రస్థానానికి బలమైన పునాది వంటిదని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించగలిగితే విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చిన్నారుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ గంగప్ప, చిలమత్తూరు మండల విద్యాశాఖ అధికారి హనుమంతరెడ్డి, బసవన్నపల్లి ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సి ఆర్ పి చంద్రమౌళి, డీఆర్‌పీల మను, జయకృష్ణ, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయాలతోనే పాఠశాలకు గుర్తింపు

### -మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



విద్యార్థుల విజయాలే విద్యాసంస్థకు నిజమైన గుర్తింపునిస్తాయని, ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమైన మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రతిభకు పురస్కారంపై చదువులకు చేయూత కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమానికి హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప హాజరయ్యారు. పాఠశాల అధ్యక్షులు డా. పి.ఎస్. శ్రీనివాసులు, కరస్పాండెంట్ డి.ఎస్. నందకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పేదరికం కారణంగా చదువు ఆగిపోకుండా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం సమాజానికి గొప్ప సేవగా కొనియాడారు. పాంచజన్య పాఠశాల ప్రతిభను ప్రోత్సహిస్తూ, అవసరమైన వారికి అండగా నిలవడం ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మండల విద్యాశాఖ అధికారి గంగప్ప మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. విద్యతో పాటు మంచి విలువలు, సామాజిక బాధ్యతలు అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తూ భవిష్యత్తుకు బాటలు వేస్తున్న పాంచజన్య పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల అధ్యక్షులు డా. పి.ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 60 శాతం మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని చెప్పారు. 570కు పైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య కోసం రూ.10 వేల చొప్పున సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సారా (588), చైతన్య (586), చేతన్ (583), సన్నిధి (583), గౌరీశంకర్ (576), హర్షిత (575), కె.చేతన్ (574), ఎస్.నిత్య (573), శరణి (572), మాహీన్ (570) ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. జశ్వంత్, దత్త దర్శన్, లక్ష్మీచంద్ర, హేమంత్, ముజాసిమ్, గంగదర్శన్, జీవన్ సాయి, గోకుల్ శ్యామ్, అతికా, ఇందు, రీహాన్, కె.చరణ్, పల్లవి తదితర విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ ఎ. విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎస్ఐఆర్ - 2026 చేపడతాం..

### ఎస్ఐఆర్ - 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



జిల్లాలో ఎస్ఐఆర్ – 2026 కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ – 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2002లో ఉన్న ఓటర్లు, 2025 లో ఉన్న ఓటర్లు, వారి పిల్లలకు సంబంధించిన మ్యాపింగ్ 68 శాతం పూర్తయిందని తెలిపారు. మ్యాపింగ్ 90 శాతంకి తక్కువ కాకుండా పూర్తి అయ్యేలా అందులో భాగంగా బిఎల్ఓలు 07.06.2026 నుంచి 14.06.2026 వరకు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలతోపాటు బిఎల్ఎలు పాల్గొని సహకరించాలని, బిఎల్ఓలతో సహకరించాలని బిఎల్ఏలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ షెడ్యూల్ వివరాలు ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణను చేపట్టేందుకు షెడ్యూల్ మరియు వివరణాత్మక సూచనలను భారత ఎన్నికల సంఘం జారీ చేసిందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యాచరణలో భాగంగా 05.06.2026 నుండి 14.06.2026 వరకు తయారీ, శిక్షణ, ప్రింటింగ్, 15.06.2026 నుండి 14.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు ఇవ్వడం జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందన్నారు. 14.07.2026 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 21.07.2026 న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, 21.07.2026 నుండి 20.08.2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి, 21.07.2026 నుండి 18.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, 22.09.2026న తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు మార్గదర్శకాల ఆధారంగా చేర్పులు/సవరణలకు లోబడి ఎస్ఐఆర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అందరు బిఎల్ఏలను నియమించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీలోపు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జరిగిందని, ఈ శిక్షణ కార్యక్రమాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆ నోటీసులకు తిరిగి సంబంధిత ఓటరు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్యాముల్, బిజెపి ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి అంజయ్య, టిడిపి ప్రతినిధి నారాయణస్వామి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి అమర్నాథ్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలి, సిపిఐ (ఎం) బాలరంగయ్య, కాంగ్రెస్ ప్రతినిధి బషీర్, జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పట్టు రైతుల సహనాన్ని పరీక్షించవద్దు -ప్రోత్సాహక బకాయిలు వెంటనే చెల్లించాలి

### -హంద్రీ-నీవా జలాలతో చెరువులు నింపాలి -రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఇకపై నిర్లక్ష్యం చేయరాదని, రైతులకు రావాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి డిమాండ్ చేశారు. కరవు కాటకాలతో అల్లాడుతున్న హిందూపురం, మడకశిర ప్రాంతాలకు శాశ్వత సాగునీటి పరిష్కారం కల్పించేందుకు హంద్రీ-నీవా జలాలను మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 265 చెరువులకు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. శనివారం హిందూపురం లోని పట్టుగూళ్ల మార్కెట్ సమావేశ భవనంలో పట్టు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోం కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పట్టు రైతుల సమస్యలు, పట్టు పరిశ్రమ అభివృద్ధి, సాగునీటి కొరత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి సెరికల్చర్ ఇన్‌చార్జి ఏడీ హంపయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి రైతులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి అందాల్సిన ప్రోత్సాహకాలు, సబ్సిడీలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోత్సాహక బకాయిల చెల్లింపులో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, కార్మికుల కొరత, వాతావరణ ప్రతికూల పరిస్థితులతో రైతులు నష్టాల పాలవుతుండగా, ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు కూడా నిలిచిపోవడం మరింత భారంగా మారిందన్నారు. పట్టు రైతు సంఘం గౌరవాధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, పట్టు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉన్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పట్టు రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ, హిందూపురం, మడకశిర ప్రాంతాలు ఎన్నో ఏళ్లుగా కరవుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, సాగునీటి వసతి లేక రైతులు వ్యవసాయాన్ని వదిలే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా నీటిని చెరువులకు మళ్లిస్తే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు మేలు జరుగుతుందని తెలిపారు. పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించక పోతే, రాబోయే రోజుల్లో రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంఘం హెచ్చరించారు. జల సాధన సమితి నాయకులు, ఓపిడిఆర్ నేత శ్రీనివాసులు మాట్లాడుతూ, మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 265 చెరువులను నింపేలా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువులు నిండితే వేలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పట్టు రైతులు తమ సమస్యలను సెరికల్చర్ శాఖ ఇన్‌చార్జి ఏడీ హంపయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ, రైతులు ప్రస్తావించిన ప్రోత్సాహక బకాయిలు, సబ్సిడీలు, ఇతర సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టు రైతుల అభివృద్ధికి శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పట్టు రైతు సంఘం కార్యదర్శి సిద్ధారెడ్డి, పరిగి నవీన్, ఆదినారాయణప్ప, నారాయణస్వామి, మడకశిర ప్రాంత రైతులు సదాశివరెడ్డి, వేమారెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసగౌడ, గోవిందప్ప, ధర్మవరం ప్రాంత రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణప్పతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పట్టు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సిందే-న్యాయం జరిగే వరకు పోరాటం

### -సర్వసభ్య సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



విధి నిర్వహణలో ఉండగానే మరణించిన కార్మికులు, రిటైర్డ్ అయిన మున్సిపల్ ఆప్కాస్ అదనపు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు వెంటనే ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇందిరా పార్కులో శనివారం నిర్వహించిన మున్సిపల్ ఆప్కాస్ అదనపు పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా పట్టణ ప్రజలకు పారిశుద్ధ్య సేవలు అందించిన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. 25 సంవత్సరాలకు పైగా సేవలందించిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ వంటి కనీస భద్రతా సౌకర్యాలు లేకపోవడం అన్యాయమన్నారు. మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలు జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతున్నాయని, వారికి ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. గత 16 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలు ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారంలో జాప్యం జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. డెత్, రిటైర్డ్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగని పక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.ఆర్. రాము, హిందూపురం మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మురళి, అధ్యక్షులు నరసింహమూర్తి, కోశాధికారి మల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీరాములు, రామాంజనప్ప, సహాయ కార్యదర్శులు బాలాజీ, రవి, హనుమంతు, మహిళా నాయకురాళు మహేశ్వరమ్మ, కవితమ్మ, ఈశ్వరమ్మ, బాధిత కుటుంబ సభ్యులు సుబ్బలమ్మ, ఓబలమ్మ, ప్రియాంక, నాగలక్ష్మి, గంగమ్మ, నారమ్మ, జయమ్మ, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా చెత్తను వేస్తే కఠిన చర్యలు

### -వ్యాపారులు చెత్తను పారిశుద్ధ్య కార్మికులకే అందించాలి
### -అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పట్టణ పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి వ్యాపారి తన బాధ్యతను గుర్తించి సహకరించాలని హిందూపురం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఓ వాణిజ్య సముదాయం (మాల్) వద్ద నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యాపారులకు, కూరగాయల విక్రేతలకు పరిశుభ్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ వ్యాప్తంగా ఉన్న వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాలు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు తమ వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను రోడ్లపై, కాలువల్లో లేదా ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా తప్పనిసరిగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. చెత్త సేకరణ, తరలింపు సేవల కోసం పురపాలక సంఘం నిర్దేశించిన రుసుమును వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం వల్ల పట్టణం అస్తవ్యస్తంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, కూరగాయల వ్యర్థాలు, ఇతర ఘన వ్యర్థాలు కాలువల్లోకి చేరి వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయని చెప్పారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కాలువలు చెత్తతో మూసుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో వ్యాపారుల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి దుకాణం ముందు చెత్త బుట్టలను ఏర్పాటు చేసి వ్యర్థాలను అందులోనే వేయాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయడం, కాలువల్లో వ్యర్థాలు పారబోయడం, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై అపరాధ రుసుములు విధించడంతో పాటు పురపాలక సంఘ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు పరిశుభ్రత విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే స్వచ్ఛమైన హిందూపురం లక్ష్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్లు శంకర్, నిజాం, కేశవతో పాటు శానిటరీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ వెంకట్రామిరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాభూమి, పులివెందుల




అమరావతిలో అభివృద్ధి శూన్యం అని కేవలం చంద్రబాబు తన అనుయాయులు అడ్డుగోలుగా కొన్న భూములకు విలువ పెంచుకునేందుకే రాజధాని లో నిర్మాణాలు అంటూ డ్రామాలు.అమరావతి కి బస్సులు వేసి తీసుకుపోవడం కాదు భూములు ఇచ్చిన రైతులే అమరావతి ఒక డొల్ల అంటూ భూములు వెనక్కు ఇచ్చేయాలని లబోదిబో అంటు న్నారు.వెంకటరామిరెడ్డి కి దమ్ముంటే వెంకటేశ్వర స్వామి సాక్షిగా పాడా ను కొనసాగిస్తాన ని చెప్పి పులివెందుల ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా విదల్చని చంద్రబాబు ను నిలదీయాలి.ఈరోజు పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న పులివెందుల ను ఇక్కడ అభివృద్ధిని చూడటానికి పక్క జిల్లాల నుంచి ఎంతో మంది బస్సులు వేసు కొని మరీ వస్తున్నారు.అలాగే పులివెందులలో నెలకొన్న విద్యాసంస్థల్లో చదవడానికి రాష్ట్రం నలు మూలల నుంచి విద్యార్థులు వస్తున్నారు, ఈ ఘనత అంతా వైయస్ కుటుంబానిది కాదా అని ప్రశ్నిస్తున్నాం. జగన్ మోహన్ రెడ్డి గారి గురించి అవినాష్ రెడ్డి గారి వ్యక్తిత్వం గురించి మాట్లాడే అర్హత నీకు లేదు.నీ పార్టీ వాళ్లే నీకు వెన్నుపోటు పొడిచి నీకు గుర్తింపు లేకుండా చేస్తున్నారు , కూతవేటు దూరంలోనే ఉన్న పార్టీ కార్యాలయం లోకి వెళ్ళలేక ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్ ఇచ్చే నువ్వు మా నాయకుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు.నీకు సొంత పార్టీ పొడిచినవెన్నుపోటుకు దిమ్మతిరిగి మొన్నటికి మొన్న మీ అధినాయకుడినే విమర్శిం చిన నువ్వు, వైయస్ కుటుంబం గురించి మాట్లాడి నీ పార్టీ లో గుర్తింపు కోసం ప్రాకులాడుతు న్నావు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చి ప్రజలను మోసం చేసిన పార్టీని , రామారావు గారిని మోసగించి సీఎం కుర్చీ లాక్కున పార్టీ ని వెన్నుపోటు పార్టీ అని పిలువక ఏమని పిలుస్తారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న ఈ ప్రజాకంటక పార్టీని నాయకులను భవిష్యత్ లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.వెంకట్రామిరెడ్డి ఇకనైనా స్థాయి తెలుసుకొని విమర్శలు చేస్తే మంచిదని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి ,విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్ర రెడ్డి, భాగ్య రాజు , మైనార్టీ నాయకులు మహబూబ్ భాష పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం.. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మరింత నాణ్యంగా రుచికరంగా మరియు పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందించాలనే లక్ష్యంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బి.ఎన్. కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ అవగాహన సదస్సుకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు హాజరయ్యారు. టాటా ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన తయారీ పరిశుభ్రత ప్రమాణాలు పోషకాహార విలువలు ఆహార పదార్థాల నిల్వ వడ్డింపు విధానాలపైసమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖఅధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం పాల్గొని నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు పోషకాలతో కూడిన ఆహారాన్ని తయారు చేసి అందించాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా విద్యార్థులఆరోగ్యపరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి కృష్ణవేణి శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, మధ్యాహ్న భోజన తయారీలో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులను వివరించారు. వంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి

### - తహసీల్దార్ విజయ్ కుమార్



ప్రజాభూమి, సిద్ధవటం: ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కోసం ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని, ప్రజలు సహకరించాలని సిద్ధవటం తహసీల్దార్ విజయ్ కుమార్ కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ జాబితాను 2025 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 31,366 ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 62.5 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన అర్హుల పేర్లనుఓటర్ జాబితాలో చేర్చడం, మరణించినవారు, వలస వెళ్లినవారు, భోగస్ ఓట్లను తొలగించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రజలు అవసరమైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు సువర్ణావకాశం

### జూన్ 9, 10 తేదీలలో ఖతార్ యాజమాన్యంతో నేరుగా ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు

### నెలకు రూ.1.30 లక్షలకుపైగా వేతనం -- ఉచిత వీసా, వసతి, వైద్య సదుపాయాలు

### -- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళి

ప్రజాభూమి, పోలవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని దోహా నగరంలో హోంకేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఖతార్‌కు చెందిన యాజమాన్యం ద్వారా నేరుగా ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులకు విదేశీ ఉపాధి అవకాశాన్ని నేరుగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతతో పాటు కనీసం రెండు సంవత్సరాల పోస్ట్ రిజిస్ట్రేషన్ అనుభవం కలిగిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5,000 ఖతారీ రియాల్స్ (సుమారు రూ.1.30 లక్షలకుపైగా) వేతనం లభించనున్నదని తెలిపారు. అదనంగా పన్ను రహిత వేతనం, ఉచిత వసతి, ఉచిత వైద్య సదుపాయం, ఉచిత రవాణా, ఉచిత వీసా, విమాన ప్రయాణ వ్యయాన్ని యాజమాన్యం భరిస్తుందని వెల్లడించారు. ప్రతి సంవత్సరం 20 రోజుల చెల్లింపు సెలవు సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు. విదేశీ ఉద్యోగ అవకాశాల ద్వారా అభ్యర్థులకు అధిక ఆదాయం, అంతర్జాతీయ స్థాయి పని అనుభవం, మెరుగైన వృత్తి ప్రగతి, కుటుంబ ఆర్థికాభివృద్ధికి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నర్సింగ్ రంగంలో అనుభవం కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాస్‌పోర్ట్, విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ ధ్రువపత్రాలు, గుడ్ స్టాండింగ్ సర్టిఫికేట్, గ్రాడ్యుయేషన్ అటెస్టేషన్ తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే డేటాఫ్లో, ప్రోమెట్రిక్ పరీక్షలు తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోపు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని తమ బయోడేటా (రిజ్యూమ్)ను ఈ-మెయిల్ చిరునామాకు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళి తెలిపారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి పార్టీ కూడా పోటీ చేస్తుంది

### దేశంలోనే వాజ్ పేయి గొప్ప నాయకుడు

### అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహాన్ని ప్రారంభించిన మంత్రి సత్య కుమార్

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో నూతనముగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని మంత్రి సత్య కుమార్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ,జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పులివెందుల మాజీ ఎమ్మెల్సీ,టిడిపి నియోజ కవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి బిజెపి నేతలు శశిభూషణ్ రెడ్డి, బండి ప్రదీప్ కుమార్ రెడ్డి, తాలూకా అధ్యక్షు డు నవీన్ లు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అటల్ బిహారీ వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటల్ బిహారి వాజ్ పేయి ప్రధానమంత్రిగా మూడు సార్లు చేయడం జరిగిందన్నారు. జవహర్ లాల్ నెహ్రూ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రధానమం త్రి అయిన మొట్టమొదటి వ్యక్తి అటల్ బిహారీ వాజ్ పేయి అన్నారు. 1998లో అణుపరీక్షలు నిర్వహిం చారన్నారు. పాకిస్తాన్ తో సంబంధాలు మెరుగుపరచడానికి లాహోర్ బస్సు యాత్ర చేశారన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేయడం జరిగిందన్నారు. అలాంటి నాయకుడి విగ్రహం పులివెందులలో ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విశేషం అన్నారు. వాజ్ పేయి లాంటి నాయకుని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పులివెందులలో బిజెపి పార్టీ పోటీ చేస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్, మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె వెంకట్రాంరెడ్డి, కూటమి నాయకులు, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో తొలి వార్షికోత్సవ వేడుకలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటం దిగువపేటలోని శ్రీ కోదండ రామాలయంలో తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ప్రత్యేక కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు అక్కిశెట్టి వెంకటరత్నం, కృష్ణకుమారి తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పంచాయతీ రాజ్ ఏఈ సుబ్రమణ్యం, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి వెంకటసుబ్బయ్యతో పాటు మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేంపల్లి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాభూమి, వేంపల్లి



వేంపల్లి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నా రు. వేంపల్లి పట్టణానికి చెందిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ ఇతర నేతలు శనివారం సింహాద్రిపురంకు వెళ్లి బీటెక్ రవిని కలిశారు. వేంపల్లె లోని పలు వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, చర్చి లైన్ లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేయించాలని షబ్బీర్ బీటెక్ రవిని కోరారు. గండి రోడ్డు లో వేయబోతున్న రోడ్డు,ఇంకా పలు సమస్య లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన బీటెక్ రవి అప్పటికప్పుడు అధికారు లకు ఫోన్ చేసి త్వరితగతిన ఈసమస్యలను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్యదర్శి మహబూబ్ షరీఫ్, మండల టిఎన్ఎస్ఎ ఫ్ అధ్యక్షుడు యాసీన్,సిహెచ్ రాహుల్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్ , తాళ్లప ల్లె అల్తాఫ్, ఇమ్రాన్,తదితరులు పాల్గొన్నారు.

## వృషబాద్రీ అభివృద్ధికి రూ 5 కోట్లు నిధులిప్పించేందుకు కృషి -మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

ప్రజాభూమి,వేంపల్లె



వేంపల్లి పాపాఘ్ని నది తీరాన ఎద్దుల కొండపై ఉన్న వృషభాచలేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా రూ 5 కోట్లు నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ,పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. పట్టణం లోని ఎద్దుల కొండపై ఉన్న వృషభాచలేశ్వర లయాన్ని శనివారం ఆయన పార్టీ నేతలతో కలిసి సందర్శిం చారు. ఈ సందర్భంగా అర్చకుడు హరి ప్రవీణ్ బీటెక్ రవికి సాదరంగా స్వాగతం పలికి ఆలయ ప్రాశస్థత, ఇతర విషయాల గురించి తెలియజేప్పి ప్రత్యేక పూజలు చేయించారు. 500 ఏళ్ల క్రితం జనమేజేయుని కాలంనాటి ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని ఆలయ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఇప్పించాలని ఆలయ కమిటీ చైర్మన్ పాలె గాని వెంకటరమణ, పాలకమండలి సభ్యులు బీటెక్ రవి దృష్టికి తీసుకొచ్చారు . ఎద్దుల కొండపై ప్రాకారం, తూర్పు, పడమర రాజగోపురాల నిర్మాణం, ఆలయ ఆవరణలో ఫ్లోరింగ్, రోడ్డు ఇరు వైపులా ప్రొటెక్షన్ వాల్, ఖాళీ ప్రదేశాలలో ఉద్యాన వనం పెంపు వంటి వాటికి రూ 5కోట్లు నిధులు అవసరమని వారు బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లా రు.ఈ విషయమై ఇదివరకే తాము తీతిదే బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి ని కలిసి వినతిపత్రం కూడా సమర్పించామన్నారు. అందుకు బీటెక్ రవి స్పందిస్తూ ఈ విషయమై తాను స్వయంగా దేవాదాయ శాఖ కమిషనర్ను కానీ, టీటీడీ చైర్మన్, ఈఓ లను కలిసి ఏదో ఒక నిధి కింద ఎద్దుల కొండ ఆలయ అభివృద్ధికి రూ 5కోట్ల నిధులు తప్పనిస రిగా ఇప్పిస్తానని బీటెక్ రవి స్పష్టం చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని ఆలయాల సంపూర్ణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల తెదేపా పరిశీలకుడు అజ్జు గుట్టు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



## ప్రాణం కాపాడిన రక్తదానం.. వెంటనే స్పందించిన సేవా మిత్రులు

### రక్తదాతలే ప్రాణదాతలు.. పోరుమామిళ్లలో మరో సేవా ఘట్టం

ప్రజాభూమి పోరుమామిళ్ల :



పోరుమామిళ్ల మండలానికి చెందిన మహబూబ్ బి అనే మహిళ శస్త్రచికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులను సంప్రదించారు. వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్ – పురం ప్రసాద్‌లు పోరుమామిళ్లకు చెందిన కలసపాటి సుధాకర్ ద్వారా బి పాజిటివ్ రక్తాన్ని అందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి అండగా నిలిచారు. ఇప్పటికే ఆరు సార్లు రక్తదానం చేసిన సుధాకర్ సేవాభావాన్ని ట్రస్ట్ ప్రతినిధులు అభినందించారు. అత్యవసర రక్త అవసరాల కోసం 8125991900 నంబర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

## అలేఖ్య పుట్టినరోజు సందర్భంగా 70 మంది యాచకులకు భోజన పంపిణీ



ప్రజాభూమి, సిద్ధవటం: దొడ్డి పెంచలయ్య అలియాస్ చిన్న కుమార్తె దొడ్డి లక్ష్మి అలేఖ్య పుట్టినరోజు సందర్భంగా లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒంటిమిట్ట, మాధవరం-1 గ్రామాల్లో 70 మంది యాచకులకు భోజన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాటాల రామయ్య మాట్లాడుతూ పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలకు వేదికగా మార్చడం అభినందనీయమని అన్నారు. యాచకులకు మధ్యాహ్న భోజనం అందజేసి వారి ఆకలి తీర్చారు. అలేఖ్య జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, దాతలు పాల్గొని అలేఖ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం సాధ్యం

ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి



ప్రజాభూమి , సిద్ధవటం: మండలంలోని జ్యోతి, వంతాటిపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న ఆయిల్ పామ్ తోటలను బద్వేల్ డివిజన్ ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు భార్గవ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి తోటలను సందర్శించి మొక్కలకు యూరియా, సూపర్ ఫాస్ఫేట్, పోటాష్, మెగ్నీషియం, బోరాన్ ఎరువులను నిర్దేశిత మోతాదులో అందించాలని సూచించారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్య పచ్చిరొట్టె ఎరువు పంటలు వేసి భూమిలో కలపాలని, జూన్--జులై నెలల్లో కూరగాయలు, దోస, వేరుశనగ వంటి అంతర పంటలు సాగు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న సబ్సిడీలను వివరిస్తూ, తక్కువ ఖర్చు, తక్కువ కూలీలతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఒక హెక్టారుకు రూ.29 వేల విలువైన మొక్కలను ఉచితంగా అందజేస్తుండగా, ఎరువులు--పురుగుమందుల నిర్వహణకు రూ.5,250, అంతర పంటల సాగుకు మరో రూ.5,250 రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ఒక్కో రైతుకు గరిష్ఠంగా 10 హెక్టార్ల వరకు వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రియా ఆగ్రో జిల్లా మేనేజర్ హరీష్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ధర్మ, రైతు సేవా కేంద్ర సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రేత అరెస్ట్..

### 22 మద్యం బాటిళ్లు స్వాధీనం



ప్రజాభూమి, సిద్ధవటం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సిద్ధవటం పోలీసులు అదుపులోకి తీసుకుని 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై హారిక శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఖాజీ పల్లె గ్రామానికి చెందిన ఆవుల చిన్నయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో అతని ఇంటిపై దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.2,170 ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి విక్రయాలు, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకుల వీధిలో పారిశుద్ధ్య సమస్యలు..

### - విషజ్వరాల భయాందోళన





ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రంలోని ఆకుల వీధిలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి ట్యాంకు పరిసరాల్లో పాచిపట్టి అపరిశుభ్రంగా మారడంతో పాటు పెన్నా నది వైపు వెళ్లే రహదారిపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని శనివారం స్థానికులు తెలిపారు. గ్రామ నివాసి సుంకర యానాదయ్య మాట్లాడుతూ, తాగు నీటి ట్యాంకు జలాశయాలను నిర్దిష్ట వ్యవధిలో శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ ఆచరణలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా విషజ్వరాలు, విరోచనాలు తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై వివరణ కోసం మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందన లభించలేదు.

# ప్రజాభూమి

## తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 07 జూన్ 2026


# ఇబ్బందులకు తెర.. ఎల్‌ఏ సాగరం వద్ద రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

### తిరుపతి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి స్పందన

ప్రజాభూమి ప్రతినిధి: తిరుపతి

జాతీయ రహదారి-71 ఆరు లేన్ల విస్తరణ పనుల కారణంగా నాయుడుపేట సమీపంలోని మందబయలు, కారుమంచివారి ఖండ్రిగ, కానూరు, తాళ్వాయపాడు హరిజనవాడ గ్రామాలతో పాటు అవని అపార్ట్‌మెంట్‌కు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంబంధిత గ్రామాల ప్రజలు, అవని అపార్ట్‌మెంట్ నివాసితులు ఈ ఫిబ్రవరిలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసి సమస్యను వివరించారు. నాయుడుపేట సమీపంలోని ఎల్‌ఏ సాగరం వద్ద బాక్స్ బ్రిడ్జ నిర్మించినప్పటికీ సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆయా గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా పోయిందని, దీంతో ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి అదనంగా సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ, సమస్య పరిష్కారం కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు, రైతులు ప్రతిరోజూ నాయుడుపేట పట్టణానికి వెళ్లే మార్గం మూసివేయబడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన లేఖలో వివరించారు. ఈ లేఖకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి అజయ్ టమ్టా స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు తిరుపతి ఎంపీ గురుమూర్తికి పంపిన లేఖలో వివరాలను తెలియజేశారు. ఏప్రిల్ 12న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. పరిశీలనలో కిలోమీటర్ 54.800 నుంచి 55.100 వరకు ఉన్న బండ్ల బాటను ఆ ప్రాంత



ప్రజలు నాయుడుపేట పట్టణానికి చేరుకునేందుకు వినియోగిస్తున్నట్లు గుర్తించామని, జాతీయ రహదారి నిర్మాణం కారణంగా ఆ అనుసంధానం దెబ్బతిన్న విషయాన్ని కూడా అంగీకరించారు. సమస్య పరిష్కారానికి అవని అపార్ట్‌మెంట్ ప్రాంతంలోని కిలోమీటర్ 54.398 నుంచి ప్రారంభమై, కిలోమీటర్ 54.800 వద్ద ఉన్న బాక్స్ బ్రిడ్జ్‌తో అనుసంధానమయ్యే విధంగా సుమారు 550 మీటర్ల పొడవుతో బండ్ల బాట నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఈ మార్గం పునరుద్ధరణ ద్వారా నాయుడుపేట పట్టణానికి ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, రహదారులపై ప్రమాదకరమైన క్రాస్ మూవ్‌మెంట్ తగ్గి రోడ్డు భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ, సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి చర్యలు చేపట్టడం ఆనందదాయకమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర మంత్రిత్వ శాఖల వద్ద నిరంతరం కృషి కొనసాగిస్తానని తెలిపారు.

# కల్లూరు కొత్తపాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వాకాడు తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్, ఎంపీడీవో



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త, టీడీపీ యువ నాయకుడు దువ్వూరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో సాగాయి.ఈ సందర్భంగా వాకాడు తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ రఫీ తదితర అధికారులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్దన్ రెడ్డి అధికారులకు ఘన స్వాగతం పలికారు.వేద పండితులచే అధికారుల పేరున విశేష పూజలు నిర్వహించగా, అనంతరం తీర్థ ప్రసాదాలను జనార్దన్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.(రూరల్)

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజులమన్యం సమీపంలోని సహాయ కాలేజీ ప్రాంతంలో గుర్తుతెలియని వృద్ధుడు (65) మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న గాజులమన్యం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. ఎస్సై హరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటిన చంద్రగిరి బిజెపి నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి చంద్రగిరి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరి మండలం రంగంపేట ఉన్నత పాఠశాల పరిధిలో ఒక మొక్కను, చంద్రగిరి పట్టణంలోని పాతపేట ఫ్లైఓవర్ సమీపంలో మరో మొక్కను నాటారు. అనంతరం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో



మండలంలోని ఎన్నికల కేంద్రాలకు బూత్ స్థాయి ప్రతినిధులను నియమిస్తూ, కేంద్రాల వారీగా కమిటీల ఏర్పాటుపై నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే ప్రతి నెల నిర్వహించనున్న కార్యక్రమాలపై కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు రాజులు పురుషోత్తం రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు టి. సుబ్రహ్మణ్యం యాదవ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె. వెంకటముని, చంద్రగిరి మాజీ సర్పంచ్ ఎస్. మునిగంగి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. దొరస్వామి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, మండల కమిటీ సభ్యులు మోహన్ రాజు, టి.ఏ.వి. ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శులు జి. శశికుమార్, ఇందు శేఖర్, ఎస్సీ మోర్చా నాయకుడు వి. నరేష్ పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

చంద్రగిరి నియోజకవర్గం లో ఉన్న యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి మెగా జాబ్ మేళా నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నాని.ప్రైవేట్ సంస్థలు ద్వారా ఉద్యోగ అవకాశాలు చంద్రగిరి నియోజకవర్గ యువతకు అందించాలని ఎమ్మెల్యే కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించి వారికి నియామక పత్రాలను అందించారు. అదే విధంగా రెండు నెలలకు ఒకసారి జాబ్ మేళా ను నిర్వహించాలని కోరుతున్న యువత .యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం తాము కృషి చేస్తామని తెలిపిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని.

# స్నేహా బాలల సంఘం పిల్లలకు పర్యావరణం పై అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట

రేణిగుంట మండలం చైతన్య పురం గ్రామం నందు చైల్డ్ రైట్స్ అండ్ యు వారి సహాయ సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన కల్పించి వాతావరణం కాలుష్యం నివారణ ప్లాస్టిక్ వాడకం తగ్గించడం రాబోయే రోజులలో ప్లాస్టిక్ పూర్తిగా తగ్గించడం రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత నివారణకు వివిధ



రకాల మొక్కలు నాటడం ఉన్న చెట్లు కాపాడుకోవడం పర్యావరణం సమతుల్యం చేసుకోవడం పై ప్రగతి రేణిగుంట మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించి పర్యావరణ నిర్మూలనకై పిల్లల చేత వివిధ రకాల డ్రాయింగ్ వేయించడం జరిగింది మరియు పర్యావరణం కాపాడడం మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు మన గ్రామంలో మురుకు కాలవలో శుభ్రం చేసుకోవడం పరిసరాల పరిశుభ్రత నీరు వృధా చేయకుండా భూగర్భ జలాలను పెంచుకోవడంపై అవగాహన కలిగించారు మరియు వీధులలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఇంటికి చెట్లు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్ మల్లీశ్వరి హెల్పర్ వనజ ఎస్సీ వి లీడర్స్ మరియు ప్రగతి సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ సురేష్ మరియు పిల్లలు పాల్గొన్నారు.

# ముక్కోటి దేవతల సాక్షిగా ప్రారంభమైన శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు

### కార్వేటినగరంలో ఆధ్యాత్మిక శోభ - గోకులానందుడి బ్రహ్మోత్సవాలకు మంగళ శ్రీకారం

ప్రజా భూమి ప్రతినిధి కార్వేటినగరం

కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణి--సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణ మహోత్సవంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.10 గంటల నుండి 8.45 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ గరుడ చిత్రంతో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

శాస్త్రోక్తంగా పూర్వాంగ క్రతువులు

అంతకుముందు ఉదయం 4 గంటల నుండి ధ్వజప్రతిష్ఠ, రక్షాబంధనం, భేరీతాడనం, నవసంధి, బలిహారణం తదితర శాస్త్రోక్త క్రతువులు నిర్వహించారు. అనంతరం తిరుమాడ వీధుల్లో నిర్వహించిన ఉత్సవంలో రుక్మిణి--సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు.

ముక్కోటి దేవతలకు ఆహ్వానం

నాలుగు మాడవీధుల్లో జరిగిన ఈ మహోత్సవ ఊరేగింపు ద్వారా స్వామివారు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి, అష్టాదశ గణాలు, ముక్కోటి



దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తారనే విశ్వాసం భక్తుల్లో నెలకొని ఉంది.

నేటి రాత్రి పెద్దశేష వాహనంపై దివ్య విహారం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రీ వేణుగోపాలస్వామివారు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

బ్రహ్మోత్సవాల ప్రధాన ఘట్టాలు

జూన్ 07 -- ఉదయం చిన్నశేష వాహనం,



రాత్రి హంస వాహనం

జూన్ 08 -- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం

జూన్ 09 -- ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం

జూన్ 10 -- ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం

జూన్ 11 -- ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజ వాహనం

జూన్ 12 -- ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం

జూన్ 13 -- ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం

జూన్ 14 -- ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం

జూన్ 09న శ్రీ స్వామివారి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన జూన్ 09న శ్రీ వేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. రూ.750 చెల్లించి గృహస్తులు (ఇద్దరు) ఈ సేవలో పాల్గొనవచ్చు. పాల్గొనే భక్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం ప్రసాదంగా అందజేయనున్నారు.

జూన్ 15న పుష్పయాగం

బ్రహ్మోత్సవాల అనంతరం జూన్ 15న మధ్యాహ్నం 1.30 గంటల నుండి 4 గంటల వరకు శ్రీ స్వామివారికి పుష్పయాగం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఆలయ ప్రధాన అర్చకులు గోపాలాచార్యులు, కంకణ బట్టార్ మురళీకృష్ణ స్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. చెంగల్‌రాయులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర



ప్రజెంట్ భూమి ప్రతినిధి తొట్టంబేడు

తొట్టంబేడు మండలం ప్రభుత్వ ఆదేశాల మేరకు లేట్ మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ చేతుల మీదుగా ఇలాగనూరు. కంచనపల్లి కాసారం గ్రామపంచాయతీ లకు 3 బ్యాటరీ ఆటో లను ఇవ్వడం జరిగింది. దీనివలన పొడి చెత్త తడి చెత్త కాంపోస్టింగ్ వ్యర్థాల సేకరణ. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా 20 లక్షల రూపాయలతో ఈ గ్రామాలలో వసతులు కల్పించడం జరుగుతుందని అదేవిధంగా ఎమ్మెల్యే చొరవతో గ్రామాల అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.

# జన సైనికుడు ప్రకాష్ ను పరామర్శించిన డాక్టర్ యుగంధర్



ప్రజాభూమి ప్రతినిధి జీడి నెల్లూరు

అనారోగ్యంతో తిరుపతి లోని రమాదేవి హాస్పిటల్ లో ఆపరేషన్ చేసుకొని డిశ్చార్జ్ అయిన జనసైనికుడు ప్రకాష్ ను తిరుపతి లో పరామర్శించి,ఆరోగ్య స్థితి గతులు తెలుసుకొని, జనసేన ఆధ్వర్యంలో ఐదు వేల (5000/-) రూపాయలు ఆర్థిక సహాయం అందించిన జనసేన పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇంచార్జి మరియు ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ యుగంధర్ పొన్న ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం మండల జనసేన పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు మాదాసి వెంకటేష్, జనసైనికులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహణ

### ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గురువారెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఘనంగా ముగిసినవి. ముందుగా గ్రంథాలయ అధికారులు లావణ్య హరిక్రిష్ణ విద్యార్థులు తో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి కి పుష్ప గుచ్చం అందించి దుషాలువతో జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ అంశములపై వ్యాసరచన, వక్తృత్వము, చిత్రలేఖనం,క్విజ్, పజిల్స్, చెస్, క్యారమ్ బోర్డ్,మ్యూజికల్ చైర్స్, లెమన్ ఉ స్పూన్ రెస్ వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రలు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి అందజేశారు. తదుపరి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో మరియు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది అని శిక్షణ లో భాగంగా పిల్లలకు పుస్తక పఠనం, వేదిక్ మేథ్స్,స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు ఇంగ్లీషు గ్రామర్, కంప్యూటర్ బేసిక్స్,పేపర్ క్రాఫ్ట్, చెస్,క్యారమ్స్ వంటి విద్యా, వినోద కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను నైపుణ్యాలను జ్ఞానమును పెంపొందించుకునే అవకాశం పొందారు అని గ్రంథాలయాలు విజ్ఞాన బాండగారాలు సరస్వతి నిలయాలు అని తెలిపారు.తదుపరి విద్యార్థిని యం జాహ్నవి వేసిన భరతనాట్యం నృత్యాని చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డిగారు తిలకించారు ఆ విద్యార్థిని అభినందించారు ఆర్ పి బాయ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గారిని వాలంటీర్స్ ముని సుబ్బారెడ్డి, షణ్ముగం, యుగంధర్, మంజునాథ్, రేవతి లను దుషాలువతో జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు పాఠకులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి లిక్కర్ వ్యాన్ బోల్తా -: బాటిళ్ల కోసం ఎగబడ్డ జనం



ప్రజా భూమి ప్రతినిధి బైరెడ్డిపల్లి

చిత్తూరు జిల్లాలోని బసిరెడ్డిపల్లి సమీపంలో మద్యం లోడుతో వెళ్తున్న ఒక వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద తీవ్రతకు వాహనంలో ఉన్న మద్యం బాటిళ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. వ్యాన్ బోల్తా పడిన విషయం తెలుసుకున్న స్థానికులు, అటుగా వెళ్తున్న ప్రయాణికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని లిక్కర్ సీసాల కోసం ఎగబడ్డారు. చేతికి దొరికినవన్నీ సర్దుకెళ్లారు. కొందరు ఏకంగా పెట్టెలతోనే తీసుకెళ్లగా, మరికొందరు లుంగీలు, టవల్లలో బాటిళ్లను నింపుకుని పరుగు తీశారు. మహిళలు కూడా ఈ హడావుడిలో పాల్గొనడం గమనార్హం. చివరికి సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి జనాన్ని చెదరగొట్టడంతో కొన్ని సీసాలు మిగిలాయి. కాగా, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# ఎర్పేడు మండలంలో కుక్ కమ్ హెల్పర్లకు పోషకాహార శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఎర్పేడు మండలంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, టాటా ట్రస్ట్స్ సహకారంతో కుక్ కమ్ హెల్పర్లకు పోషకాహారం, ఆహార భద్రత మరియు ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ-1 ప్రేమలత మేడం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మరియు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం ప్రతి కుక్ కమ్ హెల్పర్ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సీఆర్‌పీలు కూడా పాల్గొన్నారు. టాటా ట్రస్ట్స్ ప్రోగ్రామ్ అసోసియేట్ వి. లక్ష్మి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, సమతుల ఆహారం, పోషకాహార లోపాలు, రక్తహీనత నివారణ, ఫోర్టిఫైడ్ బియ్యం, అయోడైజ్డ్ ఉప్పు వినియోగం, పరిశుభ్రత మరియు ఆహార భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కుక్ కమ్ హెల్పర్లతో వంటల పోటీలు నిర్వహించారు. పాల్గొన్న వారు వివిధ రకాల పోషకాహార వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ వంటకాలను ఎంపిక చేసి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా, కుక్ కమ్ హెల్పర్లు ఉత్సాహంగా పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు.

# హనుమంత్ రెడ్డికి ఘన నివాళి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన డాక్టర్ యుగంధర్

ప్రజా భూమి ప్రతినిధి జీడీ నెల్లూరు

హనుమంత్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, ఈ విషాద సమయంలో జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హనుమంత్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం మండల ఉపాధ్యక్షుడు మునిరత్నం శెట్టి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, జనసేన సీనియర్ నాయకులు శేఖర్, చంద్రయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదాసి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# చెరువుల రక్షణ 'నీటి'పాలేనా?.. - ఆక్రమణదారులపై చర్యలేవి?

- ఏర్పేడు పల్లం చెరువుపై కన్నేసిన ఆయకట్టు ఛైర్మన్
- చెరువును చదును చేసి, మోటార్లు పెట్టి నీటి తరలింపు.. రైతుల ఆవేదన
- ఎండిపోయినా పట్టించుకోని అధికారులు.. 'స్పందన' అర్జీ పెండిందేనా?







ప్రజా భూమి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆర్సి ఇన్చార్జి

గ్రామాల్లోని జలవనరులను కాపాడి, ఆయకట్టు రైతులకు అండగా ఉండాల్సిన బాధ్యత గల 'ఆయకట్టు' ఛైర్మనే కంచె చేను మేసిన చందంగా తయారయ్యారు. ఏకంగా ప్రభుత్వ చెరువునే ఆక్రమించి, దర్జాగా రూపురేఖలు మార్చేస్తున్న ఉదంతం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం, పల్లం గ్రామ పంచాయతీలో సంచలనం సృష్టిస్తోంది. ఈ అక్రమ సాగు, నీటి దారిమళ్లింపుపై గ్రామస్థులు తిరుపతి కలెక్టరేట్ లో 'ప్రజా సమస్యల స్వీకరణ' (స్పందన) వేదికగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సొంతంగా చదును చేసి.. మోటార్లతో నీటి దోపిడీ**

పల్లం గ్రామానికి చెందిన బాధితుడు పి. వెంకటేశ్వర రావు అధికారులకు సమర్పించిన దరఖాస్తు ప్రకారం.. పల్లం గ్రామ ఆయకట్టు ఛైర్మన్ గా ఉన్న కలవకొల్లు వెంకటేశ్వర్లు అలాగే ఉప్పరపల్లి చెంచయ్య అనువారు కలిసి గ్రామానికి చెందిన ప్రధాన చెరువును అక్రమంగా ఆక్రమించుకున్నారు. తమకున్న అధికార బలంతో చెరువు లోపలి భాగాన్ని కబ్జా చేసి, యంత్రాలతో చదును చేసేశారు

**విద్యుత్ మోటార్లతో తరలింపు...**

అంతటితో ఆగకుండా చెరువులో ఉన్న నీటిని అక్రమంగా విద్యుత్ మోటార్ల ద్వారా బయటకు తోడేస్తూ తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు దీనివలన కేవలం ఆ చెరువు నీటిని మాత్రమే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న పల్లం గ్రామ పరిధిలోని సామాన్య రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు.

**నాడు 'నీళ్లు' సాకు.. నేడు అధికారుల తాత్సారం**

ఈ అక్రమ కబ్జా, నీటి దారిమళ్లింపుపై గ్రామస్థులు గతంలోనే ఉన్నతాధికారులను సంప్రదించగా.. ప్రస్తుతం చెరువులో నీరు ఎక్కువగా ఉంది కాబట్టి సర్వే చేయడం సాధ్యం కాదు, నీళ్లు తగ్గగానే పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అందరికీ న్యాయం చేస్తాం అని అధికారులు గట్టి హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం ఎండల తీవ్రతకు చెరువులోని నీరంతా పూర్తిగా ఎండిపోయి, మైదానంలా మారినా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనమూ లేదు సర్వే చేసి ఆక్రమణదారుల మోటార్లను, కంచెలను తొలగించాల్సిన రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పుడు కాలయాపన చేస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి...**

చెరువు పూర్తిగా ఎండిపోయి, కళ్లెదుటే అక్రమ సాగు పనులు కనిపిస్తున్నా అధికారులు ఎందుకు రావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆక్రమణదారుల రాజకీయ పలుకుబడి వల్లే అధికారులు వెనకడుగు వేస్తున్నారా? అని ప్రజలు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పల్లం చెరువును తక్షణమే సర్వే చేయించి, అక్రమ మోటార్లను, ఆక్రమణలను తొలగించి, సామాన్య రైతులకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ముగిసిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతిలోని గ్రేడ్ -1 గ్రంథాలయం ఘనంగా ముగిసిన ఉచిత వేసవి విజ్ఞాన శిభిరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సమస్య చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి. ఈరోజు స్థానిక గ్రేడ్ -1 గ్రంథాలయం తిరుపతిలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమానికి నడ్డి నారాయణ ఇంపాక్ట్ ట్రైనర్ సభాధ్యక్షుత వహించగా ఉమ్మడి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యా మంత్రి అరా లోకేష్. సారథ్యంలో ఈ సంవత్సరం వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతిష్మాత్మకంగా తీసుకొని ఘనంగా నిర్వహించామని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండగరాలని సరస్వతి దేవి నిలయాలని అనంతమైన జ్ఞానసంపద గ్రంథాలయాల్లో పుస్తకాల్లో ఉందని తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా వేసవిజ్ఞాన శిబిరానికి హాజరై మిగిలిన వారితో పోలిస్తే వీరు స్పోకెన్ ఇంగ్లీష్ ఇంగ్లీష్ గ్రామర్ తెలుగు గ్రామర్ తెలుగు పద్యాలు యోగ సంగీతం నృత్యం జనరల్ నాలెడ్జ్ నీతి కథలు స్పీడ్ మాథ్స్ మెమరీ టెక్నిక్స్ మొదలు అంశాలలో తర్ఫీదు పొందారని తెలిపారు.ఈ వేసవి శిక్షణ శిబిరాలు వారికీ ఎంతో గాను దోహదపడ్డాయని తెలిపారు. అనంతరం వేసవిజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు మేమెంటో మరియు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. అలాగే వీరికి శిక్షణ ఇచ్చినటువంటి రిసోర్స్ పర్సన్స్ కి శాలువా మరియు మూమెంటోతో సత్కరించారు. వేసే విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు మెమెంటోళ్లను ఉచితంగా అందజేసిన ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నిసా బేగంకి ధన్యవాదాలు తెలిపారు. తహసున్నిసా బేగంఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వారు మాట్లాడుతూ గ్రంథాలయాలలో నిర్వహించే సమ్మర్ క్యాంపులు పిల్లలలోని సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను, జీవన నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్, పేరెంటింగ్ కోచ్ మరియు లైఫ్ స్కిల్స్ ట్రైనర్ తహసున్నిసా బేగం తెలిపారు. ఆమె మాట్లాడుతూ, పిల్లల అభివృద్ధి కోసం తాను నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. "ఈ పిల్లలే మన దేశ భవిష్యత్తు. వారి సమగ్ర వికాసానికి తల్లిదండ్రులు కూడా సరైన అవగాహన మరియు శిక్షణ పొందడం అవసరం" అని పేర్కొన్నారు. పిల్లల పెంపకం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు తాను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పేరెంటింగ్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు కోరినట్లయితే పేరెంట్స్ మీటింగ్స్‌లో ప్రత్యేక పేరెంటింగ్ శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నిసా బేగం, ఇంగ్లీష్ ట్రైనర్ డాక్టర్ గోపాల్ , ఇంపాక్ట్ ట్రైనర్ నడ్డి నారాయణ, మునిలక్ష్మి ఇంపాక్ట్ ట్రైనర్, డాక్టర్ సోము ఉమాపతి ప్రముఖ రచయిత, ఎన్ పవన్ కుమార్, కే సౌమ్య, పి పవన్ కుమార్, గ్రంథాలయ అధికారి జె.శివప్రసాద్, గ్రంధాలయ సిబ్బంది గోవిందు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రంథాలయ పాఠకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## శ్రీకాళహస్తి కోర్టులో న్యాయమూర్తుల నియామకం, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని జిల్లా జడ్జికి వినతి



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఈరోజు చిత్తూరులో జిల్లా జడ్జి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి కోర్టులో ప్రస్తుతం తగిన సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వల్ల కేసుల పెండింగ్ అధికంగా ఉందని, వెంటనే న్యాయమూర్తులను నియమించి న్యాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, కోర్టు భవనంలో లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో కక్షిదారులు, న్యాయవాదులు రెండు అంతస్తులు ఎక్కి దిగడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లిఫ్ట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్‌కు ప్రత్యేక భవనం లేకపోవడంతో బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జడ్జిని కోరారు. ఈ వినతులపై జిల్లా జడ్జి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరంభాకం మునిప్రసాద్, ఉపాధ్యక్షుడు కాకి చిన్న అంకయ్య, కార్యదర్శి తులసీరామ్, సీనియర్ న్యాయవాదులు కన్నలి ప్రభాకర్ రెడ్డి, కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ పేద ప్రజల పొట్ట కొట్టే విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి- డి పీ పోలయ్య ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గ్రామీణ పేద ప్రజల పొట్ట కొట్టే వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ ఆజీవిక మిషన్ (విబి- జి రాంజీ చట్టాన్ని) రద్దు చేయాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం(ఏఐకేఎంఎస్ )రాష్ట్ర సహాయ కార్యదర్శి డి పి పోలయ్య డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక సైదాపురం లో అఖిల భారత రైతుకులిసంఘం జిల్లా కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆ సందర్భంగా విలేకరుల సమావేశం లో డి పి పోలయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఉపాధిపై తీవ్ర దెబ్బ కొట్టిందని విమర్శించారు. ఈ చట్టానికి గతంలో కేంద్రం 90% నిధులు కేటాయించేదని , కేవలం 10 శాతం రాష్ట్రాలు భరించేవని అన్నారు. ఈ చట్టం రద్దు చేసి వి బి జి రాంజీ చట్టం తేవడంతో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40% భరించాలని, దీనివల్ల అదనంగా రాష్ట్రాలపై 30 శాతం భారం పడుతుందని అన్నారు. ఉపాధి హామీ బకాయిలు వేల కోట్ల రూపాయలు విడుదల చేయకుండా కేంద్రం కాలయాపన చేస్తుందని విమర్శించారు. జూలై 1 నుండి వీబీ జీరాంజి చట్టాన్ని అమలు చేయడానికి కేంద్రం సమాయత్తమైందని అన్నారు. దీనివల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతున్నా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని అన్నారు. విబి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకూలీ 700 రూపాయలు ఇవ్వాలని డి పి పోలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు కె చంగల్ రావు,బిసి డబ్ల్యూ ఈ వ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు బి నవకోటి ఎం అనిల్ నాయకులు రత్నయ్య లు పాల్గొన్నారు.

### ప్రగతి సంస్థ స్వచ్ఛంద ఆధ్వర్యంలో

## పర్యావరణం మొక్కల పెంపకం వాతావరణం కాలుష్యం పై విద్యార్థులకు అవగాహన సదస్సు



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి రూరల్ మండలం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో లోని గ్రామాల్లో బివి పురం పాపనపల్లి దొడ్లమిట్ట ఎర్రగుడిపాడు గ్రామాల్లో విద్యార్థులకు సద్వినియోగం చేసేందుకు పర్యావరణం మొక్కల పెంపకం వాతావరణ కాలుష్యం నివారణ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం రాబోయే రోజుల్లో పూర్తిగా వినియోగం తగ్గించడం ఇంధన పొదుపు విద్యుత్ ఆదా నీరు సక్రమంగా వినియోగించడం నీటి వినియో గం వేసవిలో నీటి ఎద్దడి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని ప్రమాదాలు ఏర్పడకుండా అప్రమత్తత పై కార్యక్రమాలు పై అవగాహన కల్పిస్తూ పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయడం వృధాగా ఉన్న వస్తువులను సేకరించి వాటికి రంగులు వేసి అందమైన వస్తువులుగా రూపొందించడం తక్కువ ఖర్చుతో స్థానికంగా దొరికే వస్తువులతో కళాఖండాలుగా బాలలు బాలికలు తయారుచేసి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు . ఈ కార్యక్రమంలో వేసవిని సద్వినియోగం చేసుకుని సమయం వృధా కాకుండా కొందరు పిల్లలు చెడు వ్యసనాలను బారిన పడకుండా మానసికంగా వారిని యోగా వంటి కార్యక్రమాలపై ఆటపాటలతో శారీరిక మానసిక దృఢ సంకల్పాలే విద్యార్థులను ఉన్నత శిఖరాలు వైపు మళ్ళించేందుకు ప్రగతి సంస్థ వేసవి సెలవుల్లో ఇంటింటా బాల బాలికలను కలిసి వారిని గ్రామంలో ఒక చోటికి చేర్చి అవగాహన కల్పిస్తున్నారు . ఈ కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలు త్వరలో పాఠశాలకు వచ్చేందుకు సంసిద్ధంగా తయారు కావాలని పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు . ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో కన్వీనర్ రామచంద్ర విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులుపాల్గొన్నారు



## ఆదర్శనేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

బడుగు , బలహీన వర్గాల కోసం నిరంతరం కృషిచేసిన ఆదర్శ నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్ పేర్కొన్నారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా గూడూరు సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు తన వెయ్యి ఎకరాల ఆస్తిని పేదలకు దారాదత్తం చేశారని కొనియాడారు. బడుగు , బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. యువత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఆయన తుది శ్వాస వరకు పేదల అభివృద్ధి కొరకు అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. త్వరలో చిల్లకూరు మండలం లోని పారిచర్ల వారి పాలెం దగ్గర సి.ఆర్ ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, చరణ్, మోహన్ , భార్గవ్ , తదితరులు పాల్గొన్నారు.

## నగరి మాజీ సర్పంచ్ ముడిపల్లి వెంకటరత్నం నాయుడు 19వ వర్ధంతి



ప్రజా భూమి ప్రతినిధి నగరి

నగరి పట్టణంలో నాగలాపురం రోడ్లో ఉన్న దివంగతవెంకటరత్నం నాయుడు స్వగృహంలో ఈరోజు ఉదయం 11 గంటలకు 19వ వర్ధంతిని వారి కుమారులు హరిబాబు రవిబాబు యం వి బాబు నగరి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలోనిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్నదానం వస్త్ర దానం చేశారు ఈ సందర్భంగా నగరి జాతీయ కాపు సంఘం అధ్యక్షులు ఎం.విబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా నాన్నగారు వెంకటరత్నం నాయుడు వర్ధంతిని మా సోదరులతో కలిసి ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ వస్తున్నామని గతంలో అన్నదానం వస్త్ర దానంతో పాటు మెడికల్ క్యాంపు కూడా నిర్వహించేవారులమని కొన్ని అనివార్య కారణాలవల్ల ఈసారి నిర్వహించలేకపోయామని తెలిపారు.

## బిరదవాడ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం.. బైక్‌ను ఢీకొట్టిన కియా కారు.. యువకుడి పరిస్థితి అత్యంత విషమం నెల్లూరుకి తరలింపు!





ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద జాతీయ రహదారిపై అత్యంత ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.వేగంగా వచ్చి ఢీకొట్టిన కారు నాయుడుపేట నుంచి బైక్‌పై బిరదవాడ ఊర్లోకి వెళ్లేందుకు దాసరి వాసు (26) అనే యువకుడు జాతీయ రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు అతివేగంగా వెళ్తున్న కియా కారు.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. కారు ఢీకొట్టిన వేగానికి మోటార్ సైకిల్ దాదాపు 20 అడుగుల ఎత్తుకు ఎగిరి కిందపడింది. బైక్ నడుపుతున్న దాసరి వాసుకు తీవ్ర రక్తగాయాలై ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఓ వేప చెట్టును బలంగా ఢీకొట్టి ఆగింది. కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి తీవ్రంగా గాయపడిన వాసును నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు దాసరి వాసుకు ఏడాది క్రితమే వివాహం కాగా, కొద్దిరోజుల క్రితమే ఒక బాబు పుట్టాడు. ప్రస్తుతం ఆ యువకుడు పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ దాస్ జయంతి సందర్భంగా అన్నకాంటీన్‌లో అన్నదానం





ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

సత్యవేడు మాజీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి,ఎంపీగా సేవలందించిన స్వర్గీయ దాస్ జూన్ 7వ తేదీన 105 వ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా అన్న క్యాంటీన్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాస్ కుమారుడు భాస్కర్ దాస్ బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత సీనియర్ బ్యాంక్ మేనేజర్ సౌజన్యంతో ఏపీ అభ్యుదయ దేవాంగ సేవా సంఘం డివిఎంసి మెంబర్ గుత్తి త్యాగరాజు ఆధ్వర్యంలో అన్నదాన క్యాంటీన్లో శనివారం ఉదయం 350 మందికి అల్పాహారం,మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ క్రమంలో స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ , సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్, సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు కృష్ణయ్య యాదవ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శివయ్య తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఇందుకు సంబంధించి అన్నక్యాంటీన్ నిర్వాహకులకు గుత్తి త్యాగరాజు సొమ్మును చెల్లించారు. కాగా దాస్ మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా,తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా విశేష సేవలందించి ప్రజల మన్ననలు పొందారు.ఆయన ప్రజాసేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కో కన్వినర్ జక్కుల శివానందం,రాష్ట్ర ప్రతినిధి బండారు వినోద్,రాష్ట్ర ప్రతినిధి పడవల ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలు ప్రారంభించిన బొజ్జల బృందమ్మ

### మండల అధ్యక్షుడు :రావెళ్ళ మునిరాజా నాయుడు



ప్రజా భూమి ప్రతినిధి : తొట్టంబేడు

తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలను ఘనంగా ప్రారంభించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ, మండల అధ్యక్షుడు రావెల్ల మునిరాజు నాయుడు ఈ ఆటోలను ప్రారంభించారు.పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా ముందుగా కొబ్బరికాయ కొట్టి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ లక్ష్యంగా మండలాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ ఎలక్ట్రిక్ ఆటోలు దోహదపడతాయని తెలిపారు. డీజిల్ వాహనాలతో పోలిస్తే కాలుష్యం తగ్గడంతో పాటు నిర్వహణ ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.సురేంద్రనాథ్,డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్,గుడిమల్లం ఆలయ చైర్మన్ గిరి నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ధనంజయ నాయుడు, తంగేళ్లపాలెం సింగిల్ విండో బ్యాంక్ చైర్మన్ భీమల భాస్కర్ ముదిరాజ్ ,9 వ భూత్ యూనిట్ ఇంచార్జ్ లెక్కల. మురళి నాయుడు, సింగిల్ విండో చైర్మన్ భీమల భాస్కర్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి అలియాస్ సుబ్రహ్మణ్యం, సుధాకర్ యాదవ్, ఏజీపీ కమలాకర్, చేమూరు టిడిపి బూత్ కన్వీనర్ ముని,రాఘవరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పవన్ నాయుడు,మళ్లీ గుంట ఎస్సి బూత్ ఇంచార్జ్ కే శంకర్ మండల అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాభూమి

## తిరుపతి,చిత్తూరు 10

ఆదివారం 07 జూన్ 2026


## ప్రమాద భరితంగా విద్యుత్ సరఫరా తీగలు

### చెయ్యి చాచితే విద్యుత్ ప్రమాదం బారిన పడాల్సిందే

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వర పురం లో గూడూరు చెరువుకు అనుకుని ఉన్న విద్యుత్ తీగలు ప్రమాద భరితంగా ఉన్నాయి.స్థానికంగా ఎక్కువ గిరిజనులు నివాసం ఉంటున్నారు.వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఈ ప్రాంతం లోనే ఎక్కువగా ఆడుకుంటుంటారని స్థానికులు తెలిపారు.విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేర్లు చేతికి అందకుండా ఎత్తులో ఏర్పాటు చెయ్యాలని కొరుతున్నారు.రానున్న వర్షాకాలంలో విద్యుత్ వైర్ల మూలంగా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి



భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి (ఎఫ్.ఏ.సి) తెలిపారు. పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకొని శుక్రవారం




నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈట్ స్ట్రీట్ సమీపంలోని డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. భవిష్యత్ తరాలకు సంపూర్ణమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ప్రకృతిని కాలుష్యం నుండి కాపాడుకుందాం అనే నినాదంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం బారి నుండి మన భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్క పౌరుడి కనీస బాధ్యత అని తెలిపారు. పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులు, ప్రజలు రద్దీ ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో పారిశుధ్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టండి

### -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



నగరంలో ప్రధాన కూడళ్ళు, భక్తులు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్, ఎస్.వి. నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. దుకాణాల వద్ద, అపార్ట్మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ ల వద్ద చెత్త కుప్పలు ఎక్కువగా ఉంటున్నాయన తెలిపారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి దుకాణం వద్ద చెత్త కుండీలు ఏర్పాటు చేసుకుని తడి, పొడి చెత్త వేరు చేసి తమ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. మనల్ని అనారోగ్యం పాలు చేస్తున్న ప్లాస్టిక్ కవర్లు వంటివి వినియోగించరాదని, వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని దుకాణదారులను హెచ్చరించారు. కాలువల్లో ఉన్న చెత్త, మట్టి శుభ్రం చేసి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని ఇంజినీరింగ్, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణవార్డు సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## తోపుడుబండ్ల వ్యాపారస్తుల కడుపులు కొట్టొద్దు

### స్విమ్స్ సర్కిల్లో తోపుడు బండ్లను తొలగించడం ఆపాలి సిఐటియు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



స్విమ్స్ సర్కిల్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్ లోపల ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారుల పట్ల మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఏపీ ఫుట్‌పాత్, తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జి అన్నారు. నేడు మున్సిపల్ అధికారులు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్న ప్రాంతంలో ఇసుక దింపడంతో పాటు గోడ నిర్మాణానికి ఏర్పాట్లు చేయడం పట్ల వ్యాపారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జి, తోపుడుబండ్ల వ్యాపారస్తులు కలిసి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవిని కలిసి సమస్యను వివరించారు. స్విమ్స్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులు ఎన్నో సంవత్సరాలుగా అక్కడే వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, 2018లో అప్పటి మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని మున్సిపల్ కాంప్లెక్స్ లోపల వ్యాపారాలు కొనసాగించేందుకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. పేదల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలుతీసుకోవాల్సిన అధికారులు, వ్యాపారుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమని, కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించిన అనంతరం కూడా అక్కడ ఇటుకలు, ఇసుక దింపడం, గోడ నిర్మాణానికి ప్రయత్నించడం, పెద్ద సంఖ్యలో మున్సిపల్ సిబ్బందిని మోహరించడం సరైన విధానం కాదన్నారు. సమస్యను పరిశీలిస్తానని కమిషనర్ చెప్పిన తరువాత కూడా ఈ చర్యలు కొనసాగడం విచారకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారుల బతుకులతో చెలగాటం ఆడవద్దని, వారి ఉపాధిని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని బుజ్జి డిమాండ్ చేశారు. పేదల బతుకులను కొట్టే ప్రయత్నాలు ఆపకపోతే సిఐటియు ఆధ్వర్యంలో తోపుడుబండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## “సురక్షిత చిత్తూరు -మీ భద్రత మా బాధ్యత” కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

### మహిళలు, చిన్నారుల రక్షణ -- మాదకద్రవ్యాల నిర్మూలన -- సైబర్ నేరాల నివారణ -- రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యం

ప్రజాభూమి ప్రతినిధి :చిత్తూరు




ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ప్రత్యేక ఆలోచనతో రూపొందించిన “సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత” అనే వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని శనివారం చిత్తూరు పట్టణంలోని సంతపేటలో గల ఆర్.ఆర్. గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నాన్ కేడర్ ఎస్పీ ఎస్.ఆర్. రాజశేఖర రాజు, చుడా చైర్మన్ కటారి హేమలత, జిల్లా పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సురక్షిత చిత్తూరు లోగో మరియు కార్యక్రమ లక్ష్యాలను సబ్ -- డివిజన్ డి.ఎస్పీ జె.వెంకటనారాయణ ప్రజలకు పరిచయం చేశారు.




అనంతరం మహిళలు, చిన్నారులపై నేరాల నివారణ, మాదకద్రవ్యాల వ్యసనం, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి, మాట్లాడుతూ... ప్రజల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని అన్నారు. నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే నేరాలు జరగకుండా ముందస్తుగా అవగాహన కల్పించడం మరింత ప్రభావవంతమైన విధానమని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ మోసాలు మరియు రోడ్డు ప్రమాదాలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. “సురక్షిత చిత్తూరు” కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి కాలనీ మరియు ప్రతి కుటుంబానికి భద్రతా సందేశాన్ని చేరవేసి ప్రజల్లో అప్రమత్తత, బాధ్యత మరియు చట్టాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని ఎస్పీ తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తి పోలీసులకు భాగస్వామిగా మారినప్పుడే నేరరహిత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో పెరుగుతున్న సామాజిక, సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవడానికి అవగాహన అత్యంత ముఖ్యమని అన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ భద్రత మరియు రోడ్డు భద్రత వంటి అంశాలపై సమగ్రంగా ప్రజలను చైతన్యపరిచే ఈ కార్యక్రమం జిల్లాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం కోసం చిత్తూరు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం అభినందనీయమని అన్నారు. నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు యువతను సరైన మార్గంలో నడిపించే సామర్థ్యం ఈ కార్యక్రమానికి ఉందని పేర్కొన్నారు. సురక్షిత చిత్తూరు లక్ష్యాలను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నాయుడుపేటకు చెందిన నటరాజ కళాక్షేత్ర బృందం అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు అందించింది. మహిళలు, చిన్నారులపై నేరాలు, ప్రేమ పేరుతో మోసాలు మరియు ఎలోప్మెంట్, మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై సందేశాత్మక నాటికలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపజేసింది.



నాటికలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విలువైన సందేశాలను అందించిన కళాకారులను జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మరియు ఇతర అతిథులు ఘనంగా సన్మానించి అభినందించారు. “సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత” కార్యక్రమం ద్వారా మహిళల రక్షణ, చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ అవగాహన మరియు రోడ్డు భద్రత అంశాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.అడిషనల్ ఎస్పీ యం. దేవదాస్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓడ్డీమిట్ట వేణుగోపాలపురం గ్రామంలో, మలేరియా వ్యతిరేక మహోత్సవాలు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.




రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ తేజస్విని ఆదేశాలమేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య మరియు ఆరోగ్య సిబ్బందితో కలిసి రేణిగుంటలోని ఒడ్డి మిట్ట,వేణు గోపాల పురం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు – – జూన్ 1 నుండి 30 వరకు జరుగుతున్న సందర్భంగా 06/06/26వతేదీన ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.దోమల నియంత్రణతో మలేరియా నివారణ మాత్రమే కాకుండా ఇతర దోమల వ్యాధులైన డెంగ్యూ, చికున్గున్యా,మెదడు వాపు,ఫైలేరియా వ్యాధుల నివారణ కూడా జరుగుతుందని వివరించారు.వైద్య ఆరోగ్య శాఖ ప్రతి సంవత్సరం జూన్ నెలను మలేరియా వ్యతిరేక



మాసోత్సవంగాను, జూలై నెలను డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంను నిర్వహిస్తుందని,వర్షాకాలం ప్రారంభంఅయ్యే ఈ సమయంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉండటం వల్ల మలేరియా, డెంగ్యూ,చికున్ గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ప్రజలు సహకరించాలని కోరారు.మలేరియా సోకిన ఆడ ఎనాఫిలిస్ దోమ ఆరోగ్యవంతుని కాటు వేయడం ద్వారా వ్యాపించే వ్యాధియని,ఇది జ్వరం,వణుకు,తల నొప్పి,చెమటలు, నీరసం వంటి లక్షణాలను కలిగిస్తుందని తెలిపారు.తరచుగా వణుకుతో కూడిన జ్వరం,తలనొప్పి, ఒళ్లునొప్పులు,అధిక చెమట,నీరసం, నిస్సత్తువ లక్షణాలు ఉంటాయన్నారు. మలేరియా వ్యాధి వ్యాప్తి నివారణకు ప్రజలు ఇంటి లోపల, బయట,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎక్కడ కూడా నీరు వారం రోజులకు మించి నిల్వ ఉండకుండా చూడాలని,నీటి ట్యాంకులు,డ్రమ్‌లు, బకెట్లను మూత పెట్టడం,కొబ్బరి చిప్పలు,పాత టైర్లు, పగిలిన పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా తొలగించడం,రాత్రి సమయంలో దోమతెరలను ఉపయోగించడం, ఫుల్ హ్యాండ్స్ దుస్తులు ధరించడం, కిటికీలు, తలుపులకు దోమ జాలర్లు(మెష్) ఏర్పాటు చేసుకోవడం, అవసరమైతే దోమల నివారణకు మందులు,రెపెలెంట్లు ఉపయోగించడం చేయాలన్నారు.జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే ఆశాకార్య కర్త, (ఏ,ఎన్,ఎం) లేదా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లోని(ఎం ,ఎల్, హెచ్) పిలను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలని, సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స కూడా పొందాలని సూచించారు. మన బాధ్యతలోనే -- మన ఆరోగ్యం ఉందని,“ప్రతి శుక్రవారం . ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లోహిత, రేవతి,సూపర్వైజర్ కామరాజు,యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య, పఆశాకార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం, చేయండి - డాక్టర్ బాలకృష్ణ నాయక్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



28,29వ తేదీల్లో జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ మరియు జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శాంతకుమారి పిలుపునిచ్చారు. శనివారం,జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరమునందు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మరియు సూపర్వైజర్లకు పల్స్ పోలియో సంబంధించిన అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలోజిల్లా



వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీ.బాలకృష్ణ నాయక్, మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ జూన్ 28వ తారీఖున తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా చేయాలని కోరారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ హై రిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, గుడారాలు, సంచార జాతులు,నిర్మాణ ప్రదేశాలలో ఉండే పిల్లలను గుర్తించి వారందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ గురించి, పోలియో వ్యాక్సిన్ వినియోగాన్ని గురించి మరియు రిపోర్టింగ్ విధానాన్ని గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు డాక్టర్ హరిత,డాక్టర్ మృదుల వాణి, డాక్టర్ సెల్వియా, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఇతర ప్రోగ్రాం అధికారులు, డి ఐ ఓ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మరియు సూపర్వైజరి సిబ్బంది పాల్గొన్నారు .

## మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన శక్తి టీమ్.

ప్రజా భూమి ప్రతినిధి :తిరుపతి



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీలో గల పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత మరియు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులకు శక్తి యాప్ గురించి వివరించి, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, అత్యవసర పరిస్థితుల్లో దాని ఉపయోగం గురించి అవగాహన కల్పించారు.



అలాగే లోన్ యాప్ మోసాలు, కార్యాలయాల్లో మహిళల వేధింపులు, మహిళల అక్రమ రవాణా, మహిళలకు సంబంధించిన చట్టపరమైన రక్షణలు, గృహ హింస, మహిళలపై జరిగే నేరాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, బాలల అశ్లీలత , ఆన్‌లైన్ మోసాలు, ర్యాపిడో బైక్ సేవలకు సంబంధించిన భద్రతా అంశాలు, సైబర్ నేరాలు, గుర్తు తెలియని లింకులు మరియు వీడియో కాల్స్ ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు. అదేవిధంగా సెల్‌ఫోన్‌లు మరియు సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో సూచించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వివిధ రకాల నేరాల గురించి వివరించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112, 1930 మరియు శక్తి యాప్ ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికలు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వారి రక్షణకు తిరుపతి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి ముందే స్పందించాలి

### ట్రాన్స్ఫార్మర్ ఎత్తు పెంచాలని విజ్ఞాన్ నగర్ వాసులు విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి, వరదయ్యపాలెం



తిరుపతి జిల్లా వరదయ్యపాలెం పట్టణంలోని విజ్ఞాన్ నగర్‌లో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు, 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు కూడా ప్రజలు సంచరించే ప్రాంతానికి ప్రమాదకరంగా దగ్గరగా ఉండటం వల్ల ఎప్పుడేం జరుగుభయాందోళనలు నెలకొన్నాయి. విజ్ఞాన్ నగర్ లోని ఈ ప్రదేశం మూడు రహదారులు కలిసే ప్రధాన జంక్షన్‌గా ఉండటంతో నిత్యం చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చేతి అందేంత ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, తలకు సమీపంగా కనిపిస్తున్న కరెంటు తీగలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి. స్థానికుల కథనం ప్రకారం, ప్రమాదవశాత్తు భారీ వాహనం, చెట్టు కొమ్మ లేదా ఇతర వస్తువులు విద్యుత్ తీగలకు తగిలినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏదైనా సాంకేతిక లోపం తలెత్తినా భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు ఈ ప్రాంతం గుండా నడిచి వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాద భయం మరింత పెరిగింది. విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగమైన 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యుత్ శాఖ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తీగలను ఎత్తుకు పెంచడం, వంగిపోయిన స్తంభాలను సరిచేయడం, ట్రాన్స్‌ఫార్మర్ ప్లాట్‌ఫారమ్‌లను ఎత్తు చేయడం వంటి చర్యలు అవసరమైతే చేపడతామని విద్యుత్ శాఖ వెల్లడించింది. అయితే విజ్ఞాన్ నగర్‌లో నెలకొన్న ఈ ప్రమాదకర పరిస్థితిని వెంటనే పరిశీలించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ఎత్తుకు మార్చడంతో పాటు 11 కేవీ విద్యుత్ తీగలను కూడా నిబంధనలకు అనుగుణంగా ఎత్తుకు పెంచాలని స్థానిక ప్రజలు విద్యుత్ అధికారులను కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞాన్ నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా కోలాహలం యోగాంధ్ర-2026 ఉద్యమ కార్యాచరణ ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి

రాష్ట్రంలో యోగాంధ్ర-2026 ఉద్యమ కార్యాచరణకు కూటమి ప్రభుత్వం శనివారం నుంచి శ్రీకారం చుట్టింది యోగాంధ్ర పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు గ్రామ/ వార్డు సచివాలయాల స్థాయి నుంచి మొదలైంది. యోగా మాస్టర్ ట్రైనర్లు సుమారు 2వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి కూ డా జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని దేవాలయ ప్రాంగణంలో యోగాసనాల రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించబోతున్నారు. దీనికి అనుగుణంగా 5 జిల్లాల్లో యోగస నాల కార్యక్రమాలు జరగబోతున్నాయి అలాగే ఆదివారం నుంచి ఆరోగ్య సంరక్షణలో యోగాసనాల ప్రాధాన్యం తెలిపేలా రకరకాల ఇతివృత్తాల ఆధారం గా విద్యార్థులకు రకరకాల పోటీలు జరగబోతున్నాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు.

ఈ నెల 20 వరకు నిరాశీటకంగా జరుగుతాయని నేడొక ప్రకటనలో తెలిపారు. 14 రోజుల పాటు నాలుగు వేర్వేరు స్థాయిలలో నాలుగు అంచెల్లో పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గ్రామ/వార్డు స్థాయి నుంచి..

గ్రామ/వార్డు స్థాయిలో జూన్ 7 నుంచి జూన్ 9 వరకు, మండల స్థాయిలో జూన్ 10 నుంచి జూన్ 12 వరకు, జిల్లా స్థాయిలో జూన్ 14 నుంచి జూన్ 16 వరకు, జూన్ 18 నుంచి జూన్ 20 వరకు యోగాంధ్ర గ్రాండ్ ఫినాలె పోటీలను నిర్వహిస్తారు. గ్రామ/వార్డు స్థాయిలో విజేతలుగా నిలిచిన వారే వరుసగా మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ప్రతి ఒక్కరి టాలెంట్ ను బయటకు తీసేలా కేవలం ఆసనాలే కాకుండా వివిధ రకాల సృజనాత్మక విభాగాలలో కూడా పోటీలు నిర్వహిస్తారు.

ఆసనాల ప్రదర్శన

వ్యక్తిగత ప్రదర్శనల విభాగంలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామ ప్రదర్శన ఉంటుంది. సమూహ ప్రదర్శనల విభాగంలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా. కళాత్మక విభాగంలో యోగా సాంగ్ (తెలుగులో సొంత కవిత్వం/పాట), యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫోటోగ్రఫీ ఉంటాయి. అలాగే యోగా క్విజ్, యోగా స్లోగన్ (నినాదాలు), యోగా వ్యాస రచన పోటీలు ఉంటాయి. జూనియర్స్ ( 10 నుండి 18 సంవత్సరాలు), యువకులు ( 19 నుండి 35 సంవత్సరాలు ), సీనియర్స్ ( 36 సంవత్సరాల పైబడిన వారు) విభాగాల్లో మహిళలకు, పురుషులకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తారు. ప్రతి ఆసనాన్ని కనీసం ?5 సెకన్ల పాటు ?స్థిరంగా ప్రదర్శించాలి. ఒక ఆసనం నుండి మరొక ఆసనంలోకి మారే ప్రక్రియ నెమ్మదిగా, శోభాయమానంగా (ఖవర్ష్ట్రవ్అఎ) సాగాలి. మొత్తం ప్రదర్శన సమయం రెండున్నర నుంచి మూడు నిమిషాల పాటు ఉంటుంది. అభ్యర్థి వయస్సు, పేరును నిర్ధారించడానికి ఐడీ కార్డ్ లేదా సర్టిఫికేట్ వెరిఫికేషన్ తప్పనిసరి అందజేయాలి. మైనర్ అభ్యర్థులైతే తల్లిదండ్రులు/గార్డియన్ అండర్‌టేకింగ్ సంతకం చేయాల్సి ఉంటుంది. గ్రామ స్థాయిలో ప్రాథమిక ఆసనాలైన వృక్షాసనం, పాదహస్తాసనం, ఉష్ట్రాసనం, అర్ధమత్స్యేంద్రాసనం, సర్వాంగాసనం, త్రికోణాసనం వంటి వాటిని వయస్సును బట్టి ప్రదర్శించాల్సి ఉంటుంది. స్థాయి పెరిగే కొద్దీ ఆసనాల క్లిష్టత పెరుగుతుంది.

పాల్గొనడం ఎలా?

పోటీలలో పాల్గొనాలనుకునే ఆసక్తి గల అభ్యర్థులందరికీ ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. పోటీలలో పాల్గొనే వారు పోర్టల్ లో పేర్కొన్న వివరాలను పూర్తి చేసి తమ పేరును నమోదు చేసుకోవాలి. అభ్యర్థులు తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాలను లేదా అధికారులను సంప్రదించి కూడా నమోదు చేసుకోవచ్చు. గ్రామ/వార్డు స్థాయిలో: పంచాయతీ కార్యదర్శి అధికారిక లాగిన్ ద్వారా అభ్యర్థుల వివరాల్ని నమోదు చేస్తారు. మండల స్థాయిలో ఎంపిడీఓ లాగిన్ ద్వారా, జిల్లా స్థాయిలో జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అభ్యర్థులు తాము నివసిస్తున్న/తమ పరిధికి చెందిన ప్రాంతంలోనే పోటీ చేయడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, డిగ్రీ కళాశాల మైదానాలు, కమ్యూనిటీ హాళ్లలో ఈ పోటీల వేదికలను ఏర్పాటు చేస్తున్నారు

# 'సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి



ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులు లేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి.. .



అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధతుల తో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియోగించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# వస్కోట యల్లమ్మ ఆలయంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి

చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురంలో ఉన్న వస్కోటు యల్లమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం దాతలు ఆరో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆదనపు




ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకయ్య చౌదరి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు కొలువుదీరి ఉన్న శ్రీనివాస మంగాపురంలో తాగునీటికి కొరత లేకుండా పరిశుభ్రమైన నీరు అందించటానికి దాతలు ముందుకు రావడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఆధ్యాత్మిక స్థలంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించటం అందరికీ గర్వకారణమని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పినపెద్ద అంతరాజు చంద్రశేఖర్, గ్రామస్తులు పూల ముని రాజా,జానకి, కుమారస్వామి, కల్లూరు నాగ వెంకట్రామయ్య,మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, పూల నిరంజన్, గురునాథ్ ,పూల సురేష్ (టిటిడి), శ్రీనివాసులు పాల్గొన్నారు.

# బాల్య దశలోని చిన్న పిల్లలకు ముందస్తు ఎదుగుదల ఎంతో అవసరం

ప్రజా భూమి ప్రతినిధి,
రామచంద్రాపురం :



బాల్య దశలోని చిన్న పిల్లలకు ముందస్తు ఎదుగుదల ఎంతో అవసర మని చంద్ర గిరి ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ అధికారిని ప్రదీప్ అన్నారు.రామ చంద్రాపురం మండలం లోని అంగనవాడి కార్యకర్తలకు శనివారం కుప్పం బాదూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఐ -ఎనేబుల్డ్ ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, తిరుపతి జిల్లా వారు నిర్వహించారు.



ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారిణి ప్రదీప మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చంద్రగిరి పరిధిలో వున్న 0-6 సంవత్సరాల పిల్లల కోసం ఏఐ- ఎనేబుల్డ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎదుగుతూ ఉన్న బాల్య దశలోని చిన్న పిల్లల కోసం మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ శాఖ ఎన్నో రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ జావిద్ మాట్లాడుతూ పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, రక్తహీనత,ఏ బి డి విటమిన్ డెఫిషియన్సీ,వినికిడి సమస్యలు, చూపు సమస్యలు వంటి వాటిని గురించి తెలియజేశారు.ఈ యాప్ ద్వారా పిల్లలకు ఎలాంటి లోపాలు రాకుండా అందించవలసిన పౌష్టికాహారం తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలుసు కోవచ్చానని చెప్పారు. ఈ యాప్ లోని విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసీ డిపిఓ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు మనీలా,రేవతి, సిబ్బంది, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం,అంగన్వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పరుశురామేశ్వర స్వామి దేవాలయానికి నడుపుతున్న బస్సులకు విశేష స్పందన

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఈరోజు శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానం నందు శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. ఆదేశాల మేరకు నూతనంగా ప్రారంభించిన బస్సు పాకేజీలు తిరుపతి ఆర్ఎం సహకారంతో నాలుగవ రోజు కూడా విజయవంతంగా కొనసాగుతున్నాయి ఈ నాలుగో రోజు భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు. దర్శన అనంతరం బస్సుల్లో ప్రయాణించిన భక్తులతో మాట్లాడగా వారు ఆనందం వ్యక్తం చేశారు స్వామివారు దర్శనం చాలా పుణ్యకరమని ఇలాంటి ఆలోచన చాలా గొప్పది అని అలానే ఇంకా అధిక సంఖ్యలో బస్సులు వేసి భక్తులకు స్వామివారి దర్శనం చేయించాలని కోరారు ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీకాళహస్తి డిపో మేనేజర్ ఎం రేవతి ని కలిసి వారి డిపో నుండి కూడా బస్సులు ఏర్పాటు చేయవలసినదిగా కోరినారు శ్రీకాళహస్తి డిపో వారు కూడా సానుకూలంగా స్పందించి తప్పకుండా చేస్తామని తెలియజేశారు.



# నాగలాపురం మండల నూతన తాసిల్దారుగా ఓ.కే రోజా రాణి



ప్రజా భూమి ప్రతినిధి నాగలాపురం.

నాగలాపురం మండల నూతన తహసీల్దార్‌గా ఓ.కే. రోజ రాణి శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన హనుమాన్ నాయక్ దక్కిలి మండలానికి బదిలీపై వెళ్లగా, నారాయణవనం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఓ.కే. రోజ రాణి సాధారణ బదిలీపై నాగలాపురంకు వచ్చారు శారు.

# రాష్ట్రాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి విజన్

ప్రజా భూమి ప్రతినిధి, నెల్లూరు జిల్లా...

రాష్ట్రాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో ప్రజారోగ్య పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దొంతాలి డంపింగ్ యార్డ్‌లో నిర్మిస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను రెండేళ్లలో అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 300 కోట్ల రూపాయలతో ట్రీట్ మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారన్నారు.జూలై నెలాఖరు నాటికి 107 ప్రాసెసింగ్ ప్లాంట్లను ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి: డిటిఎఫ్

ప్రజాభూమి ప్రతినిధి,అనంతపురం : ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా చట్ట సవరణ చేయాలని లేదా ప్రత్యేక టెట్ నిర్వహించాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫోద్దీన్, జిల్లా అధ్యక్షుడు మారుతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కట్టుబడి గౌస్ లాజమ్ ప్రభుత్వాన్ని కోరారు. పదోన్నతులు, బదిలీలు, ఇతర సర్వీస్ ప్రయోజనాలకు టెట్ తప్పనిసరి కావడంతో సంవత్సరానికి రెండుసార్లు ఆఫ్‌లైన్‌లో టెట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 45 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ పరీక్షల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఉత్తీర్ణత మార్కులను 35 శాతానికి తగ్గించి, సబ్జెక్టు సామర్థ్యాలను అంచనా వేసే విధంగా పరీక్ష నిర్వహించాలని కోరారు. 100 రోజుల కార్యక్రమం, ఎస్ఎస్‌సీ, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, వేసవి ఎఫ్ఎల్ఎం తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ం

# కేబుల్ వైర్ చోరీ దొంగ అరెస్టు

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలో వరుస కేబుల్ దొంగతనాలతో రైతులను ఇబ్బంది పెట్టిన దొంగ ఎట్టకేలకు దొరికారు. వివరాల్లోకి వెళితే రైతుల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను దొంగతనం చేస్తున్న ముఠాగుర్టును పుట్లూరు పోలీసులు రట్టు చేశారు ఒక నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుండి నాలుగు లక్షల విలువైన 1400 మీటర్ల కేబుల్ వైర్ ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెళితే పుట్లూరు మండలం సూర్య పల్లి గ్రామానికి చెందిన దబ్బరవెంకట శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మే 27వ తేదీన రాత్రి వేళల్లో సూర్య పల్లి గ్రామ శివారులలోని అరటి తోటలలో ఉన్న వ్యవసాయ బోరు మోటర్లకు మరియు స్టాటర్ బాక్స్ లకు మధ్య ఉన్న కేబుల్ వైర్లను మూడు ఐరన్ మోటర్ పైపులను గుర్తుతెలియని దొంగలు కత్తిరించి ఎత్తుకెళ్లారు దీనిపై పుట్లూరు పిఎస్ లో కేసు నమోదు చేయడం జరిగినది. అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ గారి ఉత్తర్వులు మేరకు అనంతపురం రూరల్ ఎస్ డి పి ఓ టి శ్రీనివాసులు ఆదేశాల మేరకు పుట్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సత్య బాబు గారి సూచనల మేరకు పుట్లూరు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సురేంద్రబాబు పోలీస్ సిబ్బందితో కలిసి మమ్ముల తనిఖీలు చేశారు ఇందులో భాగంగా శనివారం ఉదయం సుమారు పది గంటల ప్రాంతంలో పుట్లూరు మండలం మడుగు పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెన్నంపల్లి గ్రామం బుక్కరాయసముద్రం మండలానికి చెందిన తమ్మినేని మురళి, తండ్రి తమ్మినేని నరసయ్య కేబుల్ వైర్ ను విక్రయించేందుకు తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి అతనిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి సుమారు నాలుగు లక్షల విలువైన 1400 మీటర్ల వ్యవసాయ కేబుల్ వైర్ ను మూడు ఐరన్ పైపులు ఎక్స్ఎల్ 100 మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని నిందితున్ని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు రైతుల మోటార్ల వైర్లను దొంగలిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న ముఠాను త్వరగా తిన రు సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యబాబు సబ్ ఇన్స్పెక్టర్ సురేంద్రబాబు మరియు ఏఎస్ఐ ఆదినారాయణ కానిస్టేబుల్ రమేష్ నరేష్ కుమార్ వెంకటరమణ మరియు పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# జ్ఞానాన్ని పెంచుకోవటానికి పుస్తక పఠనం ఎంతో అవసరం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

జ్ఞానాన్ని పెంచుకోవటానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయులు రాజ శేఖర్ అన్నారు.చంద్రగిరి, శాఖా గ్రంథాలయంలో శనివారం ఉచిత వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకానికి మించిన మిత్రుడు ఉండదని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవరచు కోవాలని చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో పలువురు మంచి మంచి నీతి కథలు, మంచి ఆటలను నేర్పించారు. చదరంగం ఆటలో కావలసిన మెలుకువలను వివరించారు. పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు , సర్టిఫికెట్లు,పతకాలను అందజేసారు.విద్యార్థులు పుస్తకాలు చదవడం,కథలు చెప్పడం చేసారు. విద్యార్థులు క్యారమ్, చెస్, ఆటలు ఆడినారు. వేసవి విజ్ఞాన శిబిరాలను ఎంతో చక్కగా నిర్వహించిన గ్రంథాలయ శాఖ అధికారిని రెడ్డెమ్మను అందరూ అభినందించారు. విద్యార్థులు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.ం

# ఎన్ హెచ్ ఐ టి- ఎన్ ఎస్ పి పి ఎల్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చిత్తూరు- మల్లవరం ప్రాజెక్టు కింద ఎన్ హెచ్ ఐ టి -ఎన్ ఎస్ పి పిఎల్ గాదంకి టోల్ ప్లాజా వద్ద మేనేజర్ సెందిల్ కుమార్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగాప్రకృతిని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి మరియు భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి అందరూ కలిసి ఈ క్రింది ప్రమాణాన్ని (ప్రతిజ్ఞ) తీసుకోవచ్చు:పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, మన భూమిని, ప్రకృతిని కాపాడుకోవడానికి నేను దృఢ సంకల్పం చేస్తున్నాను.నా వంతు బాధ్యతగా నేను ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతాను, వాటిని సంరక్షిస్తాను.ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణానికి హాని చేయని వస్తువులను మాత్రమే ఉపయోగిస్తాను.నీటిని, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగావాడుకుంటాను.కాలుష్యాన్ని నివారించడానికి వీలైనంత వరకు ప్రజా రవాణాను (పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్) లేదా సైకిల్‌ను ఉపయోగిస్తాను.మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, పర్యావరణాన్ని పరిరక్షించడంలో నా తోటివారికి కూడా అవగాహన కల్పిస్తాను.ప్రకృతిని రక్షించడం అంటే మన భవిష్యత్తును రక్షించడమేనని గట్టిగా నమ్ముతున్నాను అని ప్రతిజ్ఞ చేశారు.



# యోగాను జీవనశైలిగా మార్చుకుంటేనే ఆరోగ్యమే మహాభాగ్యం





## యోగాంధ్ర–2026 శిక్షణ తరగతులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

## స్వచ్ఛ ఆంధ్రకు మద్దతుగా సైకిళ్లపై వచ్చిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

## జిల్లా వ్యాప్తంగా 200 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

యోగాను కేవలం ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంగా కాకుండా... ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 'యోగాంధ్ర–2026' కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతులను జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నివారణే ధ్యేయంగా సాగుతున్న 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమానికి మద్దతుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇరువురూ జడ్పీ కన్వెన్షన్ హాల్ కు సైకిల్‌పై వచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కలెక్టర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలుమానసిక చురుకుదనం-నాణ్యమైన నిద్ర: యోగా సాధన ద్వారా కేవలం శారీరక దృఢత్వమే కాకుండా మానసిక అప్రమత్తత, శ్వాసక్రియ నియంత్రణ, రక్తప్రసరణ మెరుగుపడతాయి. ఇది ఒత్తిడిని తగ్గించి, నాణ్యమైన నిద్రను అందిస్తుంది.తగ్గనున్న వైద్య ఖర్చులు: యోగాను క్రమం తప్పకుండా ఆచరిస్తే భవిష్యత్తులో వైద్య ఖర్చులు దానంతట అవే తగ్గుతాయి. ఒక కుటుంబంలో ఒక్కరు యోగా ప్రారంభించినా, అది క్రమంగా ఆ కుటుంబ మంతటినీ ఆరోగ్యవంతంగా మారుస్తుంది.నిరంతర సాధనే విజయ రహస్యం: ఏ వ్యాయామమైనా ఒక్కరోజులో ఫలితాన్ని ఇవ్వదు. ప్రారంభంలో వచ్చే శారీరక అసౌకర్యాలను అధిగమించి, పట్టుదలతో చిన్న చిన్న మెరుగుదలలతో ముందుకు సాగితేనే జీవితంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయి.మాస్టర్ ట్రైనర్లుగా ఎంపికైన వారు ముందుగా యోగా ప్రయోజనాలను స్వయంగా అనుభవించాలి. ఆ తర్వాతే ప్రజల్లోకి వెళ్లి వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. డీకే బాలాజి, జిల్లా కలెక్టర్ మండలానికి 50 మందికి శిక్షణే లక్ష్యం: ఈ సందర్భంగా ఆయుష్ శాఖ అధికారులు యోగాంధ్ర–2026 వివరాలను వెల్లడించారు:౦వివరాలు శిక్షణ ప్రణాళికమొత్తం మాస్టర్ ట్రైనర్లు 200 మంది (పీఈటీలు, ఎంఎల్హెచ్‌పీలు)శిక్షణ కాల వ్యవధి 2 రోజులు (మొత్తం 5 సెషన్లు)తదుపరి లక్ష్యం ప్రతి మాస్టర్ ట్రైనర్ తమ మండల పరిధిలో 50 మందికి శిక్షణ ఇవ్వాలిశిక్షణా తరగతుల్లో యోగా గురువులు రెబ్బా పోతన శాస్త్రి, శేష ప్రసన్న, చింతయ్య తదితరులు వేదికపై నుండి ఆసనాలను ప్రదర్శిస్తూ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, యోగాంధ్ర నోడల్ అధికారి (మెప్మా పీడీ) సాయిబాబు, ఆయుష్ అధికారులు డాక్టర్ భాగ్యలక్ష్మి, వాహిని, డీఈవో యు.వి. సుబ్బా రావు, ఇన్చార్జి డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటరావు, మచిలీపట్నం నార్త్ తహసిల్దార్ నాగభూషణం పాల్గొన్నారు.



లింగమనేని రమేష్ రాజ్యసభ నామినేషన్ పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అమరావతి/ప్రజాభూమి ప్రతినిధి



ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యాలయంలో జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థి లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనం దబాబు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబులతో కలిసి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన లింగమనేని రమేష్‌కు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేర్ని నాని డ్రామాలు కట్టిపెట్టాలి

## జనసేన శ్రేణుల నిప్పులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎంపీపై మాజీమంత్రి పేర్ని నాని చేస్తున్న విమర్శలను జనసేన తీవ్రంగా ఖండించింది. డ్రామాలంటూ మాట్లాడే నానినే రాష్ట్రంలోనే అతిపెద్ద డ్రామా ఆర్టిస్ట్ అని, ఆ లక్షణాలే ఆయన పెట్టుబడి అని ఎద్దేవా చేసింది. ఈ నగ్న సత్యం బందరు ప్రజలకే కాక, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కూడా తెలుసని మండిపడింది.పేర్ని నాని డ్రామాల చిట్టా ఇదే..పోర్టుపై యూ-టర్న్: 2014 ఎన్నికల్లో మచిలీపట్నం పోర్టు రాకపోతే పోటీ చేయనని చెప్పి, ఆ తర్వాత మాట తప్పి డ్రామాలు ఆడింది నాని కాదాజగన్ దగ్గర డబ్బుల కోసం నాటకాలు: 2014లో జగన్ దగ్గర ఎమ్మెల్యే టికెట్ తీసుకుని, నా దగ్గర డబ్బులు లేవు, ఇల్లు తాకట్టు పెట్టాలి" అని డ్రామాలు ఆడారు. తన సొంత పార్టీ వాళ్ళ చేతే ఇళ్ళ ముందు ధర్నాలు చేయించుకుని, అధినేత దగ్గర డబ్బులు గుంజడానికి నాని ఆడిన నాటకాలను బందరు ప్రజలు మరిచిపోలేదు.అంబేద్కర్ భవనం మోసం: మచిలీపట్నం పట్టణంలో ప్రజలు ఎన్నాళ్ళ నుంచో కోరుకుంటున్న అంబేద్కర్ భవన నిర్మాణం కోసం 5 కోట్లు మంజూరు చేయించానని చెప్పిందంతా అబద్ధపు డ్రామానే.భోగరాజు భవనానికి అడ్డంకులు: భోగరాజు పట్టాభి సీతారామయ్య భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులను మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఇవ్వకుండా, తాను పదవిలో ఉన్నంత కాలం రిజల్యూషన్ పాస్ కాకుండా అడ్డుపడి డ్రామాలు చేసింది నానినే.చారిత్రాత్మక ఓటమి: సాధారణంగా రాజకీయాల్లో పది, ఇరవై వేల ఓట్లతో ఓడిపోవడం సహజం. కానీ బందరు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 50 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ప్రజలు నానిని ఓడగొట్టారు. అయినా సిగ్గు శరం లేకుండా ప్రెస్ మీట్లు పెట్టడం, నోటికొచ్చినట్లు మాట్లాడటంపై బందరు ప్రజలు అసహ్యించుకుంటున్నారు.బాధితులకు అన్యాయం చేసే కుట్ర: కొబ్బరితోట జనసేన కార్యకర్త ఇంటి విషయంలో ఎంపీ చిత్తశుద్ధితో ఉన్నారు. త్వరలోనే అనుమతులు మంజూరు చేయించి ఇల్లు కట్టిస్తారు. అయితే, జనసేన పార్టీ వాళ్ళు తనకు ఓటు వేయలేదనే అక్కసుతో, ఎక్కడ ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందోననే భయంతో నాని ప్రెస్ మీట్లు పెట్టి అడ్డుపడుతున్నారు. ఈ విషయాన్ని జనసేన కార్యకర్తలు, ప్రజలు గమనిస్తున్నారు.రాజకీయాలకే శని... బందరుకు పట్టిన దరిద్రంచెప్పుకుంటూ పోతే ఇలాంటి డ్రామాలు కోకొల్లలు. మచిలీపట్నానికి పట్టిన అతిపెద్ద దరిద్రం పేర్ని నాని. అసలు రాజకీయాలకే ఆయనొక శని ఈయన తప్ప ఇంకెవరూ లేనట్లు ఎప్పుడూ ప్రెస్ మీట్లు పెట్టి పార్టీని నాశనం చేస్తున్నారు అని వైఎస్సార్‌సీపీ నేతలే వెనుక మాట్లాడుకుంటున్నారు. నాని కావాలంటే ఒకసారి ఎంక్వయిరీ చేయించుకోవాలి.పని చేసే వ్యక్తి ఎంపీ.. ఖాళీగా ఉండేది నానిచెప్పిన మాట ప్రకారం పనిచేసే నైజం ఎంపీది. నానిలాగా డ్రామాలు ఆడటం ఆయనకు చేతకాదు. చిత్తశుద్ధితో పనిచేస్తూ బందరు అభివృద్ధి కోసం ఆయన కింది పనులపై నిరంతరం ఢిల్లీ పెద్దలను కలుస్తున్నారు బందరు పోర్టు అభివృద్ధి పనులు వేగవంతం చేయడం.బందరు - రేపల్లె రైల్వే లైన్ కోసం శ్రమించడం.గుడివాడ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేయడం.విజయవాడ - బందరు రోడ్డును 4 లైన్ల నుండి 6 లైన్లకు విస్తరించడం.పోర్టు అనుసంధాన రోడ్ల నిర్మాణం చేపట్టడం.ఇవే కాకుండా జనసేన పార్టీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా, లోక్‌సభ సబోర్డినేట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నో పార్లమెంటరీ సమావేశాల్లో ఆయన బిజీగా ఉంటున్నారు. నాని లా పనిపాటా లేకుండా ఖాళీగా కూర్చొని ప్రెస్ మీట్లు పెట్టడం ఎంపీ నైజం కాదు.నీ డ్రామాలు చూసే 2024 ఎన్నికల్లో బందరు ప్రజలు బుద్ధి చెప్పారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఎంపీపై అవాకులు చెవాకులు పేలడం, విమర్శలు చేయడం మానుకుంటే మంచిది. జరుగుతున్న ప్రతి పరిణామాన్ని బందరు ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు అని జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ మీడియా సమావేశంలో హెచ్చరించారు ఈ మీడియా సమావేశంలో జనసేన టౌన్ పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు, మాదివాడ రాము, సాయన్న శివయ్య, పిన్నిశెట్టి వేణుగోపాల్ జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# నేటి నుంచి యోగా పోటీలు..

- తొలిదశలో గ్రామ, వార్డు స్థాయిలో ఉత్సాహంగా ఆరంభం
- ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొనాలి
- యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

సమాజంలోని ప్రతి వర్గానికి యోగా పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర-2026లో భాగంగా ఈ నెల 7 నుంచి యోగా పోటీలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్ - గ్రాస్‌రూట్స్ వెల్‌నెస్ ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండలస్థాయిలో విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ



విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యునిటీ త్రో యోగా-బ్రిడ్జింగ్ కమ్యూనిటీస్ థీమ్‌తో మండలస్థాయిలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యోగా అండ్ యూత్ - బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో జిల్లాస్థాయిలో, ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు ఉంటాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉంటుందన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలు కూడా ఉంటాయని వివరించారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జ్ఞానాధారిత పోటీలు మినహా మిగిలిన పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్కరించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలకు 84980 12833, 83413 64185 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



# 'సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎవిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులు లేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎవిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు. సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి.. .అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎవిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియోగించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎవిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# నీటి సమస్యపై గట్టువాసుల ఆవేదన

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గట్టు ప్రాంత వాసులు గత మూడు నెలలుగా తాగునీరు, గృహ అవసరాల కోసం సరిపడా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన ట్యాంకర్ ఒక్కరోజు మాత్రమే నీరు సరఫరా చేసిందని, పైపుల ద్వారా కూడా అరకొరగానే నీరు వస్తోందని వాపోయారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులకు వినతులు అందజేసినా ఆశించిన స్పందన లభించలేదని, తక్షణమే తగిన చర్యలు తీసుకుని నిరంతర నీటి సరఫరా కల్పించాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో ఆనందబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని వివరణ కోరగా, సమస్యను వెంటనే పరిష్కరించి గట్టు ప్రాంతానికి నీరు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వృద్ధురాలి ఇల్లు దగ్ధం..

## తక్షణ సహాయం అందజేసిన తహసీల్దార్

ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలోని కొండ కాలనీకి చెందిన రాణి మేకల చుక్కమ్మ (75) నివాసంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుత య్యాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇరుగుపొరుగు వారు సమయస్ఫూర్తితో స్పందించి సహాయక చర్యలు చేపట్టగా, సమాచారం అందుకున్న నూజివీడు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చి సమీప ప్రాంతాలకు వ్యాపించకుండా అరికట్టారు. అనంతరం తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ సంఘటన స్థలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా బట్టలు, వంట సామగ్రి, వంట పాత్రలు, ఇతర నిత్యావసర వస్తువులతో పాటు రూ.5,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 59-2-1,Ashoknagar 1st lane.Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh and Published from D.NO. 59-2-1,Ashoknagar1st lane,Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677